


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 192, పేజీలు - 08

బుధవారం, డిసెంబర్ 24, 2025 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# రేవంత్ అసెంబ్లీ సవాల్

## - కేసీఆర్ వెళ్తారా.?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాజకీయాల్లో మరోసారి నీళ్ల–నిజాలు నిప్పు రాజేస్తున్నాయి. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన ఫామ్‌హౌస్ విరామం తర్వాత నేరుగా కృష్ణా జలాల అంశాన్ని అందుకోవడంతో దానికి దీటుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ అస్త్రం సంధించారు. జనవరి 2 నుండి ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తామని, దమ్ముంటే అక్కడికి వచ్చి ముఖాముఖి చర్చకు రావాలని కేసీఆర్‌కు సవాల్ విసిరారు. కేసీఆర్ ఏ నిర్ణయం తీసుకోబోతున్నారన్నది ఆసక్తికరంగా మారింది.

**- రేవంత్ వ్యూహం: ఇరుకున పెట్టేందుకేనా.?**

సాధారణంగా ఏదైనా కీలక అంశంపై విపక్షాలు ప్రభుత్వంపై విమర్శలు చేసినప్పుడు, అసెంబ్లీలో చర్చించాలని డిమాండ్ చేస్తాయి. కానీ ఇక్కడ పరిస్థితి రివర్స్ అయ్యింది. కేసీఆర్ బహిరంగ సభల ద్వారా ప్రజల్లోకి వెళ్తామని ప్రకటిస్తే, రేవంత్ రెడ్డి మాత్రం అసెంబ్లీకి రా.. చర్చించుకుందాం అంటున్నారు. ఇది కేసీఆర్‌ను ఇరుకున పెట్టే వ్యూహంగా కనిపిస్తోంది. ఒకవేళ కేసీఆర్ అసెంబ్లీకి రాకపోతే, ఆరోపణలు చేయడానికి తప్ప, ఆధారాలతో చర్చించడానికి ఆయన సిద్ధంగా లేరు అని ప్రజల్లోకి తీసుకెళ్లడం రేవంత్ ప్లాన్.

**- అసెంబ్లీలో జరిగే చర్చలకే విలువ ఎక్కువ**

తెలంగాణ ఉద్యమ మూలాల్లో నీళ్లు అత్యంత ప్రధానమైనవి. అందుకే కేసీఆర్ మళ్లీ అదే సెంటిమెంట్‌ను రగిలించాలని చూస్తున్నారు. అయితే, రేవంత్ రెడ్డి దీనికి బలమైన కౌంటర్ ఇస్తున్నారు. గత పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలే తెలంగాణకు మరణ శాసనం అని ఆయన ఆరోపిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న 811 టీఎంసీల్లో కేసీఆర్ 299 టీఎంసీలకే ఒప్పుకుని ద్రోహం చేశారని రేవంత్ అంటున్నారు. జూరాల వద్ద ఉండాల్సిన ఇన్ టేక్ పాయింట్‌ను శ్రీశైలంకు మార్చడం ద్వారా కాంట్రాక్టర్లకు మేలు చేశారని మండిపడుతున్నారు. ఈ ఆరోపణలను తిప్పికొట్టాలంటే కేసీఆర్ సభల కంటే, అసెంబ్లీ వేదికగా రికార్డులతో సమాధానం చెప్పడం వల్ల ఎక్కువ మైలేజ్ ఉంటుందని భావిస్తున్నారు.

**- అసెంబ్లీకి వెళ్లేందుకు కేసీఆర్ ఎందుకు విముఖం.?**

కేసీఆర్ గత కొన్నాళ్లుగా అసెంబ్లీకి దూరంగా ఉంటున్నారు. విపక్ష నేతగా ఆయన ఉన్నా బాధ్యతలను హరీశ్ రావు, కేటీఆర్ నిర్వహిస్తున్నారు. కేసీఆర్ రాకపోవడాన్ని రేవంత్ తరచూ ప్రశ్నిస్తూనే ఉన్నారు. కేసీఆర్ స్వయంగా వచ్చి తన వాగ్ధాటితో ప్రభుత్వంపై ఎదురుదాడి చేస్తే బీఆర్ఎస్ కేడర్‌లో కొత్త ఉత్సాహం వస్తుంది. ప్రభుత్వం అసెంబ్లీలో కేసీఆర్ లేని సమయంలో గత పదేళ్ల పత్రాలను బయట[illegible] ఆయనపై జల ద్రోహి ముద్ర వేసే ప్రమాదం ఉం[illegible]బ్లీకి రాకుండా

2లో..

# సుదీర్ఘ యుద్ధాలకు భారత్ సిద్ధం కావాల్సిందే

## - సీడీఎస్ సంచలనం




**ముంబై (ప్రశ్న న్యూస్)** తీవ్రవాదాన్ని నిర్మూలించేందుకు త్రిముఖ వ్యూహాన్ని ప్రయోగించాలని సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ పేర్కొన్నారు. ఐఐటీ బాంబేలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చౌహాన్ ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ స్వల్ప, దీర్ఘకాలిక తీవ్ర సంఘర్షణలు, దీర్ఘకాలిక భూ–కేంద్రీకృత యుద్ధాలకు సిద్ధపడాలని పిలుపునిచ్చారు. పరోక్షంగా పాక్, చైనా దేశాల నుంచి భారత్ ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి ఆయన ప్రస్తావించారు. భారత్ ఎదుర్కొనే సవాళ్లకు సంబంధించి సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ రెండు ప్రధాన అంశాలను వివరించారు. "మన ప్రత్యర్థి దేశాల్లో ఒకటి అణ్వాయుధ దేశం, మరొకటి న్యూక్లియర్ ఆర్మ్ డ్ కలిగిన దేశం. అందువల్ల భారత్ అణు నిరోధక స్థాయిని అధిగమించకూడదు" అని తెలిపారు. ఈ మేరకు చైనా, పాకిస్తాన్‌లను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారు. తీవ్రవాద నివారణకు 'ఆపరేషన్ సింధూర్' వంటి స్వల్పకాలిక, తీవ్రత గల సంఘర్షణలకు భారత్ సిద్ధపడాలని చౌహాన్ పేర్కొన్నారు. భూ వివాదాలున్నందున దీర్ఘకాలిక, భూ–కేంద్రీకృత ఘర్షణలకు కూడా సంసిద్ధంగా ఉండాలని, వాటిని నివారించాలని చౌహాన్ అభిప్రాయపడ్డారు. మూడో వ్యూహంలో భాగంగా, కొత్త రంగాలను ఉపయోగించుకుంటూ బలహీన ప్రత్యర్థితో అసమానతను పెంచాలని, ఇతర దేశాలు వీటిని దుర్వినియోగం చేయకుండా చూసుకోవాలని చౌహాన్ వివరించారు. తీవ్రవాదం ముప్పుగానే ఉంటుందని, దానికి రక్షణాత్మక, దాడి ప్రతిస్పందనలు అవసరం అని సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ తెలిపారు. ఆధునిక యుద్ధాలు స్వల్పకాలికంగా, మరింత వేగంగా మారుతున్నాయని

2లో..

# క్వాంటం టెక్నాలజీలో అద్భుతాలు చేసినవారికి రూ.100 కోట్లు

## - సీఎం చంద్రబాబు కీలక ప్రకటన



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఏపీ నుంచి ఎవరైనా నోబుల్ ప్రైజ్ సాధిస్తే 100 కోట్లు ఇస్తామని ప్రకటించాం, క్వాంటం టెక్నాలజీ ద్వారా దీనిని ఎవరైనా అందిపుచ్చుకుంటే వారికి వంద కోట్లు ఇస్తామని ఏపీ సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో 'క్వాంటం టాక్ బై సీఎం సీబీఎన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు తన సుదీర్ఘ అనుభవాన్ని, భవిష్యత్ విజన్‌ను రంగరించి విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. అమరావతిని ప్రపంచస్థాయి 'క్వాంటం వ్యాలీ'గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు.

**- ఐటీ నుంచి క్వాంటం వరకు ఏపీ ప్రస్థానం**

ముఖ్యమంత్రి చంద్రబాబు తన ప్రసంగంలో 25 ఏళ్ల క్రితం ఉమ్మడి రాష్ట్రంలో ఐటీ విజన్ ద్వారా తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులను గుర్తుచేసుకున్నారు. సైబరాబాద్ నిర్మాణం ద్వారా హైదరాబాద్‌ను గ్లోబల్ ఐటీ హబ్‌గా మార్చిన అనుభవంతో, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌ను క్వాంటం విప్లవానికి కేంద్రబిందువుగా మార్చబోతున్నట్లు తెలిపారు. అమెరికాలోని సిలికాన్ వ్యాలీ తరహాలో, అమరావతిని భారత

2లో..

# ప్రజా ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు విషం కక్కుతున్నారు

**- ప్రతి పైసా ప్రజల కోసమే ఖర్చు పెడుతున్నామన్న ఉపముఖ్యమంత్రి**

**- కేసీఆర్ అసెంబ్లీకి రావడానికి భయపడుతున్నాడని వ్యాఖ్య**

2లో..



# మా పాలనపై టీడీపీ-జనసేన అబద్ధాలు చెబుతోంది

**- ఆర్బీఐ లెక్కల ప్రకారం పారిశ్రామిక వృద్ధిలో ఏపీ అగ్రస్థానంలో ఉందని వెల్లడి**

**- పవన్ కల్యాణ్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడిన అంబటి రాంబాబు**

**- మెడికల్ కాలేజీల స్కామ్ భయంతోనే పవన్ వ్యాఖ్యలని ఆరోపణ**



అమరావతి (ప్రశ్న న్యూస్) మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. తమ ఐదేళ్ల పాలనలో (2019-24) పారిశ్రామిక రంగంలో రాష్ట్ర పనితీరుపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) విడుదల చేసిన

2లో..

# నువ్వు దొంగచాటుగా ఏం చేస్తున్నావో బహిర్గతం చెయ్యి

**- రేవంత్ రెడ్డి ప్రభుత్వం జీవోలను దాచిపెడుతోందని హరీశ్ రావు ఆరోపణ**

**- 13 నెలల కాలంలో 82 శాతం జీవోలను రహస్యంగా ఉంచారని విమర్శ**

**- జీవోల గోప్యతపై హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు అని వ్యాఖ్య**

**- చీకటి జీవోల మాటున ఏం చేస్తున్నారో బహిర్గతం చేయాలని డిమాండ్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాష్ట్ర ప్రభుత్వం దాచి పెట్టిన అన్ని జీవోలను నాలుగు వారాల లోపు బహిర్గతం చేయాలని, పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని హైకోర్టు ఇచ్చిన తీర్పు సోకాల్డ్ ప్రజా ప్రభుత్వానికి చెంపపెట్టు అని హరీష్ రావు అన్నారు. ప్రజా ప్రభుత్వం అని చెప్పుకోవడం కాదు రేవంత్ రెడ్డి, చీకటి జీవోల మాటున నువ్వు దొంగచాటుగా ఏం చేస్తున్నావో బహిర్గతం చెయ్యాలని డిమాండ్ చేశారు. ప్రజాపాలన అని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. జీవోలు దాచుతూ చేస్తున్న డ్రామా ఆర్టీఐ సమాధానం ఆధారంగా మా పార్టీ సీనియర్ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్ హైకోర్టులో వేసిన పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్ తో బట్టబయలు కాబోతున్నదన్నారు. ఈ సందర్భంగా హరీష్ రావు కీలక డాక్యుమెంట్లు తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేశారు. గత 13 నెలల కాలంలో వెలువడిన జీవోల గణాంకాలను విశ్లేషిస్తే, బహిర్గతమైన ప్రతి ఒక్క జీవోకు బదులుగా సుమారు ఐదు జీవోలను ప్రభుత్వం రహస్యంగా ఉంచుతోందని స్పష్టమవుతోంది. అధికారిక లెక్కల ప్రకారం, ఈ 13 నెలల కాలంలో మొత్తం 19,064 జీవోలు జారీ కాగా, అందులో కేవలం 3,290 జీవోలను మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉంచారు. అంటే దాదాపు 82 శాతం నిర్ణయాలు చీకట్లోనే ఉండిపోయాయని హరీష్ రావు లెక్కలు చెప్పారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వ నిర్ణయాలు ప్రజలకు తెలియాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, తెలంగాణలో పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోంది. సాధారణంగా బదిలీలు, నిధుల కేటాయింపులు,

2లో..

# కేసీఆర్, కేటీఆర్‌లకు నోటీసులు ఇవ్వాలని సిట్ నిర్ణయం

## - స్వాగతించిన బండి సంజయ్

**- ఎస్ఐబీని అడ్డుపెట్టుకొని బ్లాక్ మెయిల్ చేశారని ఆరోపణ**

**- టీవీ సీరియల్స్ పూర్తయ్యాయి, కానీ కేసు తేలలేదన్న విమర్శ**

**- విచారణ అధికారులకు స్వేచ్ఛనివ్వాలని డిమాండ్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో గత బీఆర్ఎస్ సర్కార్ హయాంలో రాజకీయ ప్రత్యర్థులతో పాటు కుటుంబ సభ్యుల ఫోన్లను కూడా ట్యాప్ చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు సిట్ నోటీసులు జారీ చేసేందుకు

2లో..

# దక్షిణాదిలో 'లిక్కర్ క్యాపిటల్'గా తెలంగాణ

**- తలసరి మద్యం వినియోగంలో తెలంగాణ దక్షిణాదిలో అగ్రస్థానం**

**- ఒక్కొక్కరు ఏడాదికి సగటున రూ.11,351 మద్యం ఖర్చు**

**- పట్టణాలకంటే గ్రామీణ ప్రాంతాల్లోనే వినియోగం అధికం**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) దక్షిణాది రాష్ట్రాల్లో తెలంగాణ మద్యం వినియోగంలో ప్రథమ స్థానంలో నిలిచి 'లిక్కర్ క్యాపిటల్'గా అవతరించింది. ఇక్కడ ప్రజలు మద్యం కోసం వెచ్చిస్తున్న సొమ్ము.. తలసరి వినియోగం దేశ సగటు కంటే ఎక్కువగా ఉండటం గమనార్హం. ఏడాదికి సగటు తలసరి ఆల్కహాల్ వినియోగం 4.44 లీటర్లుతో తెలంగాణ అగ్రస్థానంలో ఉండగా తర్వాతి స్థానాల్లో కర్ణాటక 4.25 లీటర్లు, తమిళనాడు 3.38 లీటర్లు నిలిచాయి. ఆంధ్రప్రదేశ్ 2.71 లీటర్ల తలసరి వినియోగంతో నాలుగో స్థానంలో ఉండగా.. కేరళ 2.53 లీటర్లతో చివరి స్థానంలో ఉంది. తెలంగాణలో ముఖ్యంగా బీర్ల వినియోగం గత ఏడాది కాలంలో ఊహించని రీతిలో పెరిగింది. వేసవి కాలంలోనే కాకుండా ఏడాది పొడవునా బీర్లను మంచినీళ్లలా తాగేస్తున్నారు.

2లో..

# పని ప్రారంభించిన బీజేపీ కొత్త చీఫ్ నితిన్ నబీన్

**- రాహుల్ గాంధీ, తేజస్విపై ఫైర్**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఇటీవలే బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా బాధ్యతలు చేపట్టిన నితిన్ నబిన్.. తమ పార్టీ రాజకీయ ప్రత్యర్థులపై దృష్టిసారించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. వారిద్దరినీ 'పార్ట్‌టైమ్ రాజకీయ నాయకులు' అని విమర్శించారు. బీజేపీ కార్యకర్తలు పూర్తికాలం అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి పాట్నా వచ్చిన ఆయనకు, మంగళవారం మిల్లర్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా నితిన్ నబిన్ మాట్లాడుతూ

2లో..

# బంగ్లాదేశ్ లో అరాచకం

**- మళ్లీ సైనిక పాలన భయాలు**



ఢాకా (ప్రశ్న న్యూస్) బంగ్లాదేశ్‌లో రాజకీయ పరిస్థితులు మరోసారి సంక్షోభంలో కూరుకుపోయాయి. ప్రధాన సలహాదారు మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వం దేశంలో శాంతిభద్రతలను కాపాడటంలో ఘోరంగా విఫలమైందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో దేశ పరిపాలన మరోసారి సైన్యం చేతుల్లోకి వెళుతుందేమోనన్న ఆందోళనలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. దేశవ్యాప్తంగా పెరిగిపోయిన హింసాత్మక ఘటనలు,

2లో..

ప్రజాప్రశ్న



# రేవంత్ అసెంబ్లీ సవాల్

రేవంత్ వేసిన పారిపోయారు అనే విమర్శను ఎదుర్కోవడం కష్టమవుతుంది.

**-ప్రజలకు కావాల్సింది రాజకీయాలు కాదు.. నిజాలు**

కృష్ణా నీటిలో తెలంగాణకు దక్కాల్సిన హక్కుల విషయంలో రాజకీయం పక్కన పెట్టి నిజాలు బయటకు రావాలని సామాన్యులు కోరుకుంటున్నారు. రేవంత్ రెడ్డి నీళ్లు-నిజాలు పేరుతో చర్చకు పిలిచిన ఈ తరుణంలో, కేసీఆర్ అసెంబ్లీకి వెళ్లి తన అనుభవంతో సమాధానం ఇస్తారో లేక తనదైన శైలిలో సభల ద్వారానే ప్రజలను ఆకట్టుకుంటారో చూడాలి. జనవరి 2న అసెంబ్లీ గంట మోగితే తప్ప ఈ సస్పెన్స్ వీడదు.

# సుదీర్ఘ యుద్ధాలకు భారత్ సిద్ధం కావాల్సిందే

సీడీఎస్ వివరించారు. “కొత్త రంగాలలో యుద్ధం వేగవంతంగా మారింది. దీని కాలవ్యవధి తక్కువ, తీవ్రత చాలా ఎక్కువ. నిర్ణయాలు తక్కువ సమయంలో తీసుకోవాలి. కేవలం నాలుగు రోజులు మాత్రమే కొనసాగి, భారత్ కు నిర్ణయాత్మక విజయం అందించిన ఆపరేషన్ సింధూర్‌లో ఇది స్పష్టంగా కనిపించింది” అని ఆయన పేర్కొన్నారు.

ఇక ఏప్రిల్ 22 న జమ్మూ కాశ్మీర్ అనంత్ నాగ్ జిల్లాలోని పహల్గామ్ లోయలో ఉగ్రమూకలు రెచ్చిపోయారు. నలుగురు ఉగ్రవాదులు సృష్టించిన మారణహోమంలో 26 మంది అమాయక టూరిస్టులు ప్రాణాలు కోల్పోయారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ ఈ దాడుల వెనకాల ఉన్నట్లు తేలిన నేపథ్యంలో పాకిస్థాన్ పై భారత్ ఆపరేషన్ సింధూర్ చేపట్టింది. పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ లోని 9 కీలక ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసింది. వందలాది మంది ఉగ్రమూకలను హతమార్చింది.

# క్వాంటం టెక్నాలజీలో అద్భుతాలు చేసినవారికి రూ.100 కోట్లు

‘క్వాంటం వ్యాలీ’గా అభివృద్ధి చేస్తామన్నారు. భారతీయుల డీఎన్ఏలోనే విజ్ఞానం ఉందని, ప్రాచీన కాలం నుండి గణితం, ఖగోళ శాస్త్రం మరియు నగర ప్రణాళికలో మన నైపుణ్యాన్ని నిరూపించుకున్నామని పేర్కొన్నారు.

**- ఆర్థిక వృద్ధి, యువతకు ఉపాధి**

ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి నలుగురు ఐటీ నిపుణుల్లో ఒకరు భారతీయులేనని, వారిలో అత్యధికులు ఆంధ్రప్రదేశ్ నుంచే ఉన్నారని సీఎం గర్వంగా ప్రకటించారు. సుందర్ పిచాయ్, సత్య నాదెళ్ల వంటి దిగ్గజాలు గ్లోబల్ కంపెనీలను నడిపిస్తున్నారని, రాబోయే రోజుల్లో క్వాంటం రంగంలోనూ ఏపీ యువత అగ్రస్థానంలో ఉండాలని ఆకాంక్షించారు.

ప్రధాని మోదీ ‘వికసిత్ భారత్’ లక్ష్యంతో భారత్ 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగే క్రమంలో ఏపీ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. విశాఖను డేటా సెంటర్ల హబ్‌గా, తిరుపతిని స్పేస్ సిటీగా, అనంతపురం-కడప ప్రాంతాలను ఏరోస్పేస్ కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు.

**- లక్ష మంది క్వాంటం నిపుణుల తయారీ**

క్వాంటం రంగంలో నైపుణ్యం కలిగిన మానవ వనరులను తయారు చేసేందుకు ప్రభుత్వం ‘స్కిల్ రోడ్ మ్యాప్’ సిద్ధం చేసింది. నవంబర్ 13న ఇచ్చిన ఒక్క ప్రకటనతోనే 54 వేల మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకోవడంపై సీఎం సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో లక్ష మంది క్వాంటం నిపుణులను తయారు చేయడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. వైద్యం, సుస్థిర వ్యవసాయం, వాతావరణ అంచనా మరియు రక్షణ రంగాల్లో క్వాంటం కంప్యూటింగ్ అద్భుతమైన మార్పులను తీసుకువస్తుందని, ఈ సాంకేతికత ద్వారా ప్రజలకు తక్కువ వ్యయంతో మెరుగైన సేవలు అందించవచ్చని తెలిపారు.

**- నోబెల్ బహుమతికి 100 కోట్ల ప్రోత్సాహకం**

గతంలో ప్రకటించిన విధంగానే, ఏపీ నుంచి ఎవరైనా క్వాంటం టెక్నాలజీ లేదా ఇతర రంగాల్లో నోబెల్ బహుమతి సాధిస్తే వారికి ప్రభుత్వం తరపున వంద కోట్ల రూపాయల బహుమతిని అందజేస్తామని చంద్రబాబు నాయుడు పునరుద్ఘాటించారు. అమరావతిలో కేవలం పరిశోధనలే కాకుండా, వచ్చే రెండేళ్లలో క్వాంటం కంప్యూటింగ్ పరికరాల ఉత్పత్తిని కూడా ఇక్కడి నుంచే ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. భవిష్యత్ టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో ఆంధ్రప్రదేశ్ ఎప్పుడూ ‘ఫస్ట్ మూవర్’గా ఉంటుందని, ఎవరినీ అనుసరించబోదని ధీమా వ్యక్తం చేశారు.

# ప్రజా ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు విషం కక్కుతున్నారు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రెండేళ్లుగా అసెంబ్లీకి హాజరు కాని కేసీఆర్ మీడియా సమావేశంలో మాత్రం ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు విషం చిమ్ముతున్నారని ఆయన విమర్శించారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం పినపాక గ్రామంలో నూతన సబ్ స్టేషన్ నిర్మాణానికి ఆయన భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ, ప్రతి పైసా ప్రజల కోసమే ఖర్చు చేస్తున్నామని స్పష్టం చేశారు.

తమ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం చేయలేదని అన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కోసం ప్రతి సంవత్సరం రూ.12,500 కోట్లు విద్యుత్ శాఖకు ప్రభుత్వం చెల్లిస్తోందని భట్టివిక్రమార్క తెలియజేశారు. బీఆర్ఎస్ నాయకులు తోలు తీస్తామంటూ దిగజారి మాట్లాడుతున్నారని, తాము వారిలా మాట్లాడలేమని పేర్కొన్నారు. అలా మాట్లాడే వారికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ అసెంబ్లీకి రావడానికి భయపడుతున్నారని భట్టివిక్రమార్క అన్నారు.

# మా పాలనపై టీడీపీ-జనసేన అబద్ధాలు చెబుతోంది

గణాంకాలతో, కూటమి నేతల అబద్ధాలు బట్టబయలయ్యాయని తెలిపారు. ‘ఎక్స్’ వేదికగా స్పందించిన జగన్, వైసీపీ ప్రభుత్వం ‘బ్రాండ్ ఏపీ’ని నాశనం చేసిందని, పెట్టుబడిదారులను తరిమేసిందని టీడీపీ-జనసేన నిరంతరం ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఈ ఆరోపణల్లో కొంచెమైనా నిజం ఉండి ఉంటే పారిశ్రామిక రంగంలో ఏపీ పనితీరు దారుణంగా ఉండేదని, కానీ వాస్తవాలు భిన్నంగా ఉన్నాయని తెలిపారు.

ఆర్బీఐ లెక్కల ప్రకారం 2019-24 మధ్య తయారీ రంగంలో స్థూల విలువ జోడింపు (జీవీఏ)లో ఆంధ్రప్రదేశ్ దక్షిణ భారతదేశంలో ప్రథమ స్థానంలో, దేశంలో ఐదో స్థానంలో నిలిచిందని గుర్తుచేశారు. అలాగే, పారిశ్రామిక వృద్ధిలో కూడా దక్షిణాన మొదటి స్థానంలో, దేశవ్యాప్తంగా 8వ స్థానంలో ఉందని పేర్కొన్నారు. “ఇది బ్రాండ్ ఏపీని నాశనం చేయడమా? లేక పరివర్తనాత్మక నాయకత్వంతో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమా?” అని జగన్ ప్రశ్నించారు.

**- పవన్ రౌడీ భాష మాట్లాడుతున్నారు: అంబటి రాంబాబు**

ఇదిలా ఉండగా, వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పవన్ ప్రసంగాలు దూకుడుగా, గందరగోళంగా ఉంటున్నాయని, ఆయన మాటలు ఆయనకే అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి పవన్ రౌడీ భాష మాట్లాడటం తగదని హితవు పలికారు.

ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ స్కామ్‌పై భయంతోనే పవన్ తమ పార్టీపై విమర్శలు చేస్తున్నారని అంబటి ఆరోపించారు. చంద్రబాబు ఈ కాలేజీలను తన అనుచరులకు కట్టబెట్టాలని చూస్తున్నారని, ఈ వ్యవహారంలో పవన్‌కు కూడా వాటా ఉందేమోనన్న అనుమానం కలుగుతోందని ఆయన అన్నారు.

# నువ్వు దొంగచాటుగా ఏం చేస్తున్నావో బహిర్గతం చెయ్యి

విధానపరమైన నిర్ణయాలు జీవోల రూపంలో వెలువడతాయి. అయితే, కీలకమైన అంశాలను ‘కాన్ఫిడెన్షియల్ కేటగిరీ కింద ఉంచడం లేదా ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయకపోవడం ద్వారా ప్రభుత్వం సమాచారాన్ని దాస్తోందనే ఆరోపణలు వస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలోనూ జీవోలను దాచిపెట్టడంపై తీవ్ర విమర్శలు చేసిన ప్రస్తుత పాలకులు, అధికారంలోకి వచ్చాక అదే పంథాను అనుసరించడం చర్చనీయాంశంగా మారిందని బీఆర్ఎస్ వర్గాలంటున్నాయి. ప్రభుత్వాలు మారినా ‘జీవోల మాయాజాలం’ మాత్రం మారడం లేదని ఈ గణాంకాలు చెబుతున్నాయి. కేవలం 17.2% జీవోలు మాత్రమే పబ్లిక్ డొమైన్‌లో ఉండటం వల్ల, మిగిలిన 15,774 జీవోలలో ఏముంది? అవి ఎవరికి ప్రయోజనం చేకూరుస్తున్నాయి? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. సమాచార హక్కు చట్టం స్ఫూర్తిని దెబ్బతీసే విధంగా ఈ రహస్య విధానం సాగుతోందని మండిపడుతోంది. ముఖ్యంగా ఆర్థిక లావాదేవీలు, భూ కేటాయింపులు వంటి వివాదాస్పద అంశాలపై విమర్శలు రాకుండా ఉండేందుకే ఇలా ‘బ్లాంక్ నంబర్ల’తో జీవోలను దాచిపెడుతున్నారనే అనుమానాలు రాజకీయ వర్గాల్లో బలంగా ఉన్నాయి. పారదర్శకత గురించి గొప్పలు చెప్పుకునే పాలకులు, జీవోల విషయంలో ఎందుకు ఇంత గోప్యత పాటిస్తున్నారో సమాధానం చెప్పాలని విపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం కొన్ని భద్రతాపరమైన లేదా సున్నితమైన అంశాలను రహస్యంగా ఉంచే అధికారం కలిగి ఉన్నప్పటికీ, ఇంత భారీ స్థాయిలో (82%) జీవోలను దాచిపెట్టడం అనేది అరుదైన విషయమని అంటున్నారు.

# కేసీఆర్, కేటీఆర్‌లకు నోటీసులు ఇవ్వాలని సిట్ నిర్ణయం

సిద్ధమవుతోంది. ఈ కేసులో ఇప్పటికే ఐపీఎస్ ప్రభాకర్ రావు సహా పలువురు కీలక నిందితుల్ని విచారిస్తున్న సిట్, తదుపరి రాజకీయ నేతల్ని విచారణకు పిలువబోతోంది. ఈ పరిణామంపై కేంద్రమంత్రి బండి సంజయ్ స్పందించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లకు నోటీసులు జారీ చేయాలని సిట్ తీసుకున్న నిర్ణయాన్ని బండి సంజయ్ స్వాగతించారు. తనతో సహా ఎంతోమంది నేతల ఫోన్లను ట్యాప్ చేయించడమే కాకుండా, ఎన్నో కుటుంబాల్లో చిచ్చు పెట్టి, ఆఖరికి కన్నబిడ్డ, అల్లుడి ఫోన్లనూ ట్యాప్ చేయించి, ఎంతో పేరున్న ఎస్ఐబీ వ్యవస్థను భ్రష్టు పట్టించారని బీఆర్ఎస్ నేతలపై బండి ఫైర్ అయ్యారు. ఎస్ఐబీని అడ్డుపెట్టుకొని, బ్లాక్ మెయిల్ చేసి కాంట్రాక్టర్లు, లీడర్ల నుండి డబ్బులు వసూలు చేసినట్టు ఆరోపణలు కూడా ఉన్నాయని ఆయన ఆరోపిచారు. వాటిపైనా సమగ్రంగా దర్యాప్తు చేయాలని కోరారు. కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొంటారా? లేక పూర్తిస్థాయిలో విచారణ జరిపి దోషులను తేల్చుతారా? అనేది అనుమానమే అన్నారు. ఎందుకంటే ఫోన్ ట్యాపింగ్ కేసు సమయంలో ప్రారంభమైన టీవీ సీరియల్స్ అన్ని ఎపిసోడ్స్ కూడా పూర్తయ్యాయన్నారు. కానీ ఫోన్ ట్యాపింగ్ కేసు మాత్రం ఇంకా కొనసాగుతూనే ఉందన్నారు. విచారణ అధికారులపై ఒత్తిడి తీసుకురాకుండా వారికి స్వేచ్ఛనివ్వాలని, ఫోన్ ట్యాపింగ్ సూత్రధారుల కుట్రలను బయటపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన తెలిపారు.

# దక్షిణాదిలో ‘లిక్కర్ క్యాపిటల్’గా తెలంగాణ

తెలంగాణలో ఒక్కొక్కరు ఏడాదికి సగటున రూ. 11,351 మద్యాన్ని కొనుగోలు చేసేందుకు ఖర్చు చేస్తున్నారు. దేశంలో మరే రాష్ట్రంలోనూ ఈ స్థాయిలో ఖర్చు చేయడం లేదు. దీనికి భిన్నంగా ఆంధ్రప్రదేశ్‌లో సగటు మనిషి ఏడాదికి రూ. 6,399 మాత్రమే ఖర్చు చేస్తున్నారు. అంటే ఏపీతో పోలిస్తే తెలంగాణలో మద్యంపై పెట్టే ఖర్చు దాదాపు రెట్టింపుగా ఉంది. ఈ భారీ విక్రయాల ఫలితంగా తెలంగాణ ప్రభుత్వ ఖజానాకు ఏటా సుమారు రూ. 36,000 కోట్ల పైచిలుకు ఆదాయం సమకూరుతుందని అంచనా. సాధారణంగా పట్టణాల్లోనే మద్యం వినియోగం ఎక్కువ ఉంటుందనే అభిప్రాయం ఉంటుంది. కానీ, తెలంగాణలో మాత్రం పట్టణ ప్రాంతాల కంటే గ్రామీణ ప్రాంతాల్లోనే మద్యం వినియోగం అత్యధికంగా నమోదైంది. పండుగలు, శుభకార్యాలు, సామాజిక వేడుకల్లో మద్యం అనివార్యంగా మారడం దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. మద్యం విక్రయాల ద్వారా ప్రభుత్వాలకు భారీగా రాబడి వస్తున్నప్పటికీ ఇది సామాజికంగా అనేక అనర్థాలకు దారితీస్తోందని సామాజికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మద్యం అధిక వినియోగం వల్ల కాలేయ సంబంధిత వ్యాధులు, రక్తపోటు, ఇతర దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. సామాన్య, పేద కుటుంబాల్లో సంపాదనలో అధిక భాగం మద్యానికే వెచ్చించడంతో పిల్లల విద్య, ఆరోగ్యం, పౌష్టికాహారంపై ప్రభావం పడుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వాల మద్యం విధానాలు, ధరల వ్యత్యాసం, లభ్యతలో మార్పుల వల్ల వినియోగం ఇతర దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే తక్కువగా ఉందని నిపుణులు చెబుతున్నారు. రాష్ట్ర ఆదాయం కోసం మద్యాన్ని ప్రోత్సహించడం కంటే, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే దిశగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని హెచ్చరిస్తున్నారు.

# పని ప్రారంభించిన బీజేపీ కొత్త చీఫ్ నితిన్ నబీన్

రాహుల్ గాంధీ జాతీయ సంస్థలను, దేశాన్ని పదేపదే అగౌరవపరుస్తున్నారని ఆరోపించారు. “రాహుల్ గాంధీ దేశంలో ఉన్నప్పుడు రాజ్యాంగాన్ని, ఎన్నికల సంఘాన్ని విమర్శిస్తారు. అదే విదేశాలకు వెళ్లినప్పుడు ఏకంగా దేశాన్నే కించపరిచేలా మాట్లాడతారు. ఇలాంటి వ్యక్తులకు కచ్చితంగా శిక్ష పడాలి” అని అన్నారు. ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ పేరును ప్రస్తావించకుండా, ఆయనపై కూడా పరోక్షంగా విమర్శలు చేశారు. “బిహార్‌లో మరో నేత ఉన్నారు. ఆయన కూడా పార్ట్‌టైమ్ రాజకీయాలే చేస్తుంటారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతుంటే సభను వదిలి వెళ్లిపోతారు” అని వ్యాఖ్యానించారు. శాసనసభ బాధ్యతల పట్ల ఆయనకు చిత్తశుద్ధి లేదని అన్నారు. రాజకీయాల్లో షార్ట్‌కట్‌లు ఉండవని, దీర్ఘకాలిక లక్ష్యంతో నిరంతరం పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో చివరి వ్యక్తి వరకు చేర్చడమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. బీహార్‌లో మొదలైన బీజేపీ విజయ పరంపర త్వరలోనే పశ్చిమ బెంగాల్, కేరళ రాష్ట్రాలకు కూడా విస్తరిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తాను ఏ పదవిలో ఉన్నా, తన హృదయంలో పాట్నా, బీహార్ ప్రజలకు ప్రత్యేక స్థానం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

# బంగ్లాదేశ్ లో అరాచకం

అరాచక పరిస్థితులు ఈ వాదనలకు మరింత బలం చేకూరుస్తున్నాయి. దేశంలో నెలకొన్న హింసాత్మక పరిస్థితులపై మాజీ మంత్రి అమీర్ ఖుస్రు మహమూద్ చౌదరి వంటి నేతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ప్రజాస్వామ్యం కాదని, ‘మాబోక్రసీ’ (మూకల పాలన)గా మారిందని ఆయన ఆరోపించారు. ఇటీవల చట్టోగ్రామ్‌లోని భారత కాన్సులేట్‌పై జరిగిన దాడి ఈ ఆరోపణల తీవ్రతను తెలియజేస్తోంది.మధ్యంతర ప్రభుత్వం విఫలమవడం వల్లే దేశంలో శాంతిభద్రతలు క్షీణించాయని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) సెక్రటరీ జనరల్ మీర్జా ఫక్రుల్ ఇస్లాం ఆలంగీర్ ఆరోపించారు. 2026 ఫిబ్రవరిలో జరగనున్న కీలకమైన సార్వత్రిక ఎన్నికలు, దేశవ్యాప్త ప్రజాభిప్రాయ సేకరణకు ముందు భద్రతా వైఫల్యాలు సైనిక జోక్యానికి దారితీయవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. బంగ్లాదేశ్ చరిత్రను పరిశీలిస్తే సైనిక తిరుగుబాట్లు కొత్తేమీ కాదు. 1971లో పాకిస్థాన్ నుంచి స్వాతంత్ర్యం పొందిన నాటి నుంచి డజనుకు పైగా తిరుగుబాట్లు, కుట్రలు జరిగాయి. 1975 ఆగస్టులో దేశ జాతిపిత షేక్ ముజిబుర్ రెహ్మాన్‌ను ఆయన కుటుంబంతో సహా సైన్యం దారుణంగా హత్య చేసి అధికారాన్ని చేజిక్కించుకుంది. ఆ తర్వాత దేశం ఏళ్లపాటు అస్థిరతలో మగ్గింది. లెఫ్టినెంట్ జనరల్ జియావుర్ రెహ్మాన్ అధికారంలోకి వచ్చి బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ)ని స్థాపించారు. కానీ 1981లో ఆయన కూడా సైనిక అధికారుల చేతిలో హత్యకు గురయ్యారు. అనంతరం 1982లో జనరల్ హుస్సేన్ మహమ్మద్ ఇర్షాద్ రక్తపాతరహిత తిరుగుబాటుతో అధికారాన్ని చేజిక్కించుకుని, 1990 వరకు నియంతలా పాలించారు. ప్రస్తుత పరిస్థితులపై సైనిక తిరుగుబాటు జరగవచ్చంటూ వస్తున్న వార్తలను బంగ్లాదేశ్ సైన్యం ఇంటర్-సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్పీఆర్) విభాగం ఖండించింది. సైన్యం ఐక్యంగా, రాజ్యాంగబద్ధమైన విధులకు కట్టుబడి ఉందని స్పష్టం చేసింది. అయితే, ఇటీవల కాలంలో బంగ్లాదేశ్‌లో పాకిస్థాన్, ముఖ్యంగా దాని గూఢచార సంస్థ ఐఎస్ఐ కార్యకలాపాలు పెరిగాయన్న నివేదికలు ఆందోళన కలిగిస్తున్నాయి. కొద్ది నెలల క్రితం ఐఎస్ఐ కమాండర్ ఒకరు ఢాకాలో పర్యటించడం ఈ అనుమానాలకు తావిస్తోంది. బంగ్లాదేశ్‌ను మరింత అస్థిరపరిచేందుకు ఇస్లామాబాద్ ప్రయత్నించే అవకాశాన్ని తోసిపుచ్చలేమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఈ పరిణామాల మధ్య, బంగ్లాదేశ్ ఆర్మీ చీఫ్ జనరల్ వకార్-ఉజ్-జమాన్ ఇటీవలే భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదికి ఫోన్ చేసి మాట్లాడారు. బంగ్లాదేశ్‌లోని భారత ఆస్తులన్నింటికీ పూర్తి భద్రత కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ హామీ ప్రస్తుతానికి కొంత ఉపశమనం కలిగించినా, యూనస్ ప్రభుత్వం శాంతిభద్రతలను అదుపులోకి తేలేకపోతే సైన్యం జోక్యం అనివార్యమనే భయాలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి.

# యుటిఎఫ్ జిల్లా కమిటీలో బద్వేల్ కు సముచిత స్థానం.

**-జిల్లా కార్యదర్శిగా కె.సుధాకర్, ఐక్య ఉపాధ్యాయ కన్వీనర్ గా టి.శివ ప్రసాద్, అకడమిక్ సెల్ జిల్లా కన్వీనర్ గా వీరదాసరి క్రిస్టఫర్ ఎన్నిక.**

**బద్వేలు** మైదుకూరు పట్టణంలోని డిసిఎల్ ఫంక్షన్ హాల్ లో ఆదివారం జరిగిన ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) జిల్లా కౌన్సిల్ సమావేశాలలో జిల్లా కమిటీ ఎన్నికలలో బద్వేల్ కు సముచిత స్థానం లభించింది. బద్వేలు ప్రాంతం నుండి జిల్లా అధ్యక్షులుగా మాదన విజయ కుమార్ ఎన్నిక కాగా, జిల్లా కార్యదర్శిగా బద్వేల్ పట్టణంలోని గుప్తానగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న కేతగాని సుధాకర్, ఐక్య ఉపాధ్యాయ పత్రిక జిల్లా కన్వీనర్ గా బద్వేల్ మండలం లోని రాంనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న టి.శివప్రసాద్, అకడమిక్ సెల్ జిల్లా కన్వీనర్ గా గోపవరం మండలం రాధాకృష్ణ నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నందు పి.ఎస్.హెచ్.ఎం పనిచేస్తున్న వీరదాసరి క్రిస్టఫర్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యాయ రంగంలో వీరు చేస్తున్న సేవలకు గుర్తింపుగా జిల్లా కమిటీలో చోటు లభించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము చేస్తున్న కృషికి యుటిఎఫ్ జిల్లా కమిటీ గుర్తింపు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు పాటుపడుతూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఉపాధ్యాయులకు ప్రభుత్వం నుండి రావలసిన సౌకర్యాల కోసం ఉపాధ్యాయులను కూడగట్టి ఉద్యమాలు చేపడతామన్నారు.

# హలో యువత మేలుకో..

## చెడు వ్యసనాల నుండి నిన్ను నువ్వు కాపాడుకో”...


- దేవనకొండలో నిర్వహించిన గోడపత్రికల ఆవిష్కరణ కార్యక్రమంలో..
- దేవనకొండ తాసిల్దార్ ఎం. సుదర్శనం, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సి.రమేష్ లు యువతకు పిలుపు...



**దేవనకొండ** నేటి యువతరం మాలగద్రవ్యాలను మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని దేవనకొండ మండల తహసీల్దార్ ఎమ్. సుదర్శనం, జిల్లా ఉపాధ్యక్షులు సి. రమేష్ లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా యువతలో వేగంగా పెరుగుతున్న మాదక ద్రవ్యాల వినియోగం,గుట్కా?గంజాయి?మద్యం వంటి చెడు వ్యసనాల ప్రభావాన్ని అరికట్టేందుకు ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఒక సమగ్ర అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా మంగళవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో “హలో యువత మేలుకో ? చెడు వ్యసనాల నుండి నిన్ను నువ్వు కాపాడుకో” పేరుతో రూపొందించిన వాల్‌పోస్టర్ లను ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు విద్యార్థులతో కలిసి మరియు దేవనకొండ తహసీల్దార్ ఎమ్.సుదర్శనమ్ తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...“ప్రతి రోజూ నమోదు అయ్యే కేసుల్లో పెద్ద సంఖ్య యువతలో వ్యసనాలకు సంబంధించినవే డ్రగ్స్, గుట్కా, మద్యం వంటి ఉపద్రవాలు ఆరోగ్యాన్ని మాత్రమే కాదు ?విద్యను, ఉపాధిని, భవిష్యత్తును, కుటుంబ శాంతిని పూర్తిగా నాశనం చేస్తున్నాయన్నారు. యువతను వ్యసనాల బారిన పడదీయడానికి ప్రయత్నించే మాఫియాలు, అక్రమ వ్యాపారులపై సామాజిక జాగ్రత్త తప్పనిసరి అని పేర్కొన్నారు. కుటుంబం?పాఠశాల?పోలీసులు?సమాజం కలిసి పనిచేస్తేనే వ్యసనాలకు అడ్డుకట్ట వేయగలం” అని తెలిపారు. యువజన సంఘాలు ముందుకు వచ్చి సామాజిక బాధ్యతతో కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు.“రాష్ట్రవ్యాప్తంగా ప్రతి కాలేజీ, ప్రతి గ్రామం, ప్రతి నగరంలో యువజన?విద్యార్థి వర్గాలలో విస్తృత ప్రచారం ప్రారంభిస్తున్నామన్నారు. వాల్‌పోస్టర్లు, అవగాహన సమావేశాలు, ర్యాలీలు, కళాజాథాలు, సెమినార్ల ద్వారా ‘వ్యసనాలన్నీ వినాశనాలకు ప్రారంభం’ అనే సందేశాన్ని ప్రతి యువకునికి చేరుస్తాం” అని తెలిపారు. ముఖ్యంగా వ్యసనాల వ్యాపారానికి రాజకీయ సంరక్షణ ఉండకూడదన్నారు. సమాజం జాగ్రత్తగా నిలబడితేనే యువతకు ఆరోగ్యకరమైన భవిష్యత్తు నిర్మాణం సాధ్యం అవుతుందన్నారు. వ్యసనం వ్యక్తిగత సమస్య కాదు అని కుటుంబం, సమాజం, రాష్ట్రాన్ని ప్రభావితం చేసే సామూహిక ప్రమాదం అన్నారు . అందుకే ఆటలు, క్రీడలు, పుస్తకాలు, కళలు, సేవా కార్యక్రమాలు వంటి సానుకూల దారుల్లో యువతను నడిపించేందుకు మా ఉద్యమం కొనసాగుతుంది” అని అన్నారు.ఈ కార్యక్రమంలో తదితరులు ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి కె. భాస్కర్, యువజన సంఘం మండల నాయకులు విజయ్ ప్రకాష్ రవితేజ మనోజ్ భరత్ రాజేంద్ర వెంకటేష్ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ ఎన్నికలలో తనకు ఓటు వెయలేదని రైతు పై దాడి చేసిన కాకర్లపల్లి సర్పంచ్

- ప్రమాణ స్వీకారం చెసి 24 గంటలు కాక ముందే రైతు పై దాడి
- కాకర్లపల్లి సర్పంచ్ పై చట్టపర చర్యలతో పాటు అనర్హత వేటు వేయాలి
- మంథని అంబేద్కర్ చౌక్ లో కాకర్లపల్లి గ్రామస్తుల ధర్నా





**మంథని** మొన్న జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో తనకు సపోర్ట్ చేయలేదని, ఓటు వేయలేదనే అక్కసుతో మంథని మండలం కాకర్లపల్లి గ్రామ సర్పంచ్ కన్నెబోయిన కొమురయ్య అదే గ్రామానికి చెందిన సామాన్య రైతు పర్శవెన సమ్మయ్య ను మంగళవారం ఉదయం తన పొలం వద్ద ఎవరు లెని సమయంలో దాడి చేసి వ్యవసాయ పని కోసం ఉపయోగించే పారతో కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు బాధితున్ని ద్విచక్ర వాహనంపై మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చి చికిత్స చేయించి వైద్యుల సలహా మేరకు అంబులెన్స్ లో గోదావరిఖని కి వెళ్లి స్కానింగ్ తీసుకొని వచ్చారు. గ్రామస్తులు బాధితుడు సమ్మయ్యతో కలసి మంథని మంథని పోలీస్ స్టేషన్ లొ పిర్యాదు చేశారు. అనంతరం మంథని అంబేద్కర్ చౌరస్తాలో కాకర్లపల్లి గ్రామస్తులతో కలసి బాధిత రైతు పర్శవెన సమ్మయ్య ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ సర్పంచ్ గా ప్రమాణ స్వీకారం చెసి 24 గంటలు గడవకముందే మంగళవారం తెల్లవారు జామున ఒక సర్పంచ్ గుండా లాగా సామాన్య రైతు పై దాడి చెయ్యడం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచ్ గా సమస్యలు పరిష్కరించాల్సిన సర్పంచ్ ప్రత్యక్షంగా దాడులకు దిగడం హేయమైన చర్య అని అన్నారు. పోలీస్ అధికారులు ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి దాడికి పాల్పడిన సర్పంచి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కాకర్లపల్లి గ్రామ సర్పంచ్ గా రాజ్యాంగం ప్రకారం తన విధులు శాంతియుతంగా నిర్వహించాల్సింది పోయి రౌడీ ముఖాలగా వ్యవహరించడం సిగ్గుచేటు అన్నారు. గ్రామంలో ఒక సామాన్య రైతుపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఇట్టి సంఘటనపై జిల్లా కలెక్టర్ స్పందించి గ్రామ సర్పంచ్ పై అనర్హత వేటు వేసి సస్పెండ్ చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. నాకు వ్యతిరేకంగా గ్రామములో పనిచేసిన నీతో పాటు అందరి అంతు చూస్తానని బెదిరింపులకు దిగుతున్నాడని బాధితుడు రైతు పర్శవెన సమ్మయ్య ఆరోపించారు.నన్ను ఎప్పటికైనా చంపేస్తానని బెదిరించాడని ఆవేదనను వ్యక్తం చేశాడు. ఈ ధర్నా కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బూడిద గణేష్, గ్రామస్థులు మెండే రాజయ్య,ఆకుల శ్రీనివాస్, పర్శవెన గట్టయ్య,కన్నెబోయినా ఓదెలు, ఆకుల మల్లయ్య, ఆకుల సాయి, ఎలకుర్తి మహేష్ లతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఈ నెల 28 వరకు సర్వ దోష నివారణ మహా యజ్ఞము



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ జిల్లా కండ్లకోయలో ఉన్న సాయి గీతా ఆశ్రమంలో ఈనెల 28, వరకు వార్షిక ఆధ్యాత్మిక ఉత్సవమైన సర్వ దోష నివారణ మహా యజ్ఞంను ఘనంగా నిర్వహించనుంది. ఈ సందర్భంగా, ఏడు రోజుల పాటు ఏడు విభిన్న హోమాలు నిర్వహించబడతాయి. ఈ సప్తాహ హోమాలు, ధార్మిక కోరికల నెరవేర్పు, జీవితంలోని సవాళ్లను అధిగమించడం, మంచి ఆరోగ్యం, దీర్ఘాయుష్షును ప్రసాదించడం, అలాగే భక్తులకు అనేక ఆధ్యాత్మిక లౌకిక లాభాలను కలిగించేందుకు నిర్వహించబడతాయి. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై ఈ హోమాలలో పాల్గొని దైవ ఆశీర్వాదాలు పొందనున్నారు. చివరి రోజున, సర్వ దోష నివారణ మహా యజ్ఞం మహా వైభవంగా నిర్వహించబడుతుంది. ఈ సందర్భంగా లక్షలాది మంది భక్తులు సామూహిక కొబ్బరికాయ కొట్టే కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ మహత్తర ఆచారం సర్వలోక క్షేమం, ప్రపంచ శాంతి, మరియు పంచభూతాల సౌహార్దానికి అంకితమైంది. ఈ వార్షికోత్సవంలో పాల్గొనాలని సాయి గీతా ఆశ్రమం ప్రతి ఒక్కరు హాజరు కావాలని కోరుతుంది. భక్తులు ఈ కార్యక్రమాలలో పాల్గొని సార్వత్రిక శ్రేయస్సు, సామూహిక సమృద్ధికి కారణమవాలని కోరుతోంది.

# రిపోర్టర్ ని దూషించిన డిప్యూటీ కమిషనర్ పై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు

**- వివరణ కోరితే బెదిరింపులకు పాల్పడ్డ ముషీరాబాద్ డిసి రామాంజనేయులు రెడ్డి**



సికింద్రాబాద్ (ప్రశ్న న్యూస్) అవినీతి అక్రమాలపై వివరణ కోరినందుకు ఓ జర్నలిస్టును ముషీరాబాద్ డిప్యూటీ కమిషనర్ రామాంజనేయులు రెడ్డి ఇష్టం వచ్చిన రీతిలో మాట్లాడడంతో పాటు బెదిరింపులకు పాల్పడుతూ దుర్భాషలాడిన విషయం పై గ్రేటర్ హైదరాబాద్ రిపోర్టర్లు చిలకలగూడ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిజం వృత్తి రీత్యా అధికారులకు ఎవరైనా ఫిర్యాదు చేసిన లేక ఏదైనా సమస్య కాని అవినీతి అక్రమాలు కానీ అధికారుల దృష్టికి మేము తీసుకువెళ్లినప్పుడు తిరిగి వాళ్ళని దానికోసం వివరణ అడగడం సహజమని అలా అడిగినందుకు జిహెచ్ఎంసిలో ఉన్నత అధికారి అయ్యుండి తన స్థాయిని మరిచి ఓ డిప్యూటీ కమిషనర్, రిపోర్టర్ను ఇష్టా రాజ్యాంగ దూషించటంతో పాటు బెదిరింపులకు పాల్పడినందుకు యావత్ జర్నలిస్టులోకం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇదే ఒక అధికారిని ఓ రిపోర్టర్ తిట్టి ఉంటే ఇప్పటి వరకే కేసు నమోదు చేసి రిపోర్టర్ని అరెస్టు చేయించేవారు. అలాంటిది రిపోర్టర్లను తిట్టిన మున్సిపల్ ఉన్నత అధికారులు ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడంతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది.

# విద్యార్థులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నేత సుధాకర్



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) విద్యార్థినీ విద్యార్థులకు కాంగ్రెస్ సీనియర్ నేత మారేపల్లి సుధాకర్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. గుండ్ల పోచంపల్లి జిహెచ్ఎంసి పరిధి బాసురేగడి లోని సెయింట్ క్లారెట్ పాఠశాలలో సెమీ క్రిస్మస్ ప్రోగ్రామ్స్ ను నిర్వహించారు. క్రిస్మస్ ను పురస్కరించుకొని పాఠశాలలో నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు కాంగ్రెస్ సీనియర్ నేత మారేపల్లి సుధాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల విద్యార్థులకు చదువుతోపాటు ఆటలు ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. క్రిస్మస్ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలను అభినందించారు. విద్యార్థులకు శారీరక శ్రమ ఎంతో అవసరమని ఇందుకోసం ఆటలలో పాల్గొనాలని సూచించారు. ప్రస్తుతం విద్యార్థులకు చదువుల మీద ఉన్నంత శ్రద్ధ ఆటలపై ఉండడం లేదని తెలిపారు. ఆటల విషయంలో తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ప్రోత్సహించాలని సూచించారు. ఆ పాఠశాల ఫాదర్ జేమ్స్, బెన్నీ లు మాట్లాడుతూ క్రిస్మస్ వేడుకల కోసం పాఠశాలలో నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను వారు అభినందించారు. ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం సైతం క్రిస్మస్ సందర్భంగా పాఠశాల లో క్రీడా పోటీలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. అనంతరం విద్యార్థులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల సిబ్బందితోపాటు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ముది రాజ్ కార్పొరేషన్ ఏర్పాటుతో

# మత్స్యకారులకు ఉపాధి కల్పిస్తాం

**వనపర్తి** రానున్న రోజులన్ని మత్స్యకారులకు మంచి రోజులేనని, ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ముదిరాజుల, మత్స్య సహకార సంఘాల అభివృద్ధికి కృషి చేస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వనపర్తి పట్టణంలోని నల్లచెరువులో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి గారితో కలిసి ఆయన చేప పిల్లలను విడుదల చేశాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పెద్ద సామాజికవర్గమైన ముదిరాజ్ మరియు మత్స్యకారుల, అభివృద్ధికై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సాధించిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం చట్టం ద్వారా కార్పొరేషన్ స్థాపించి మత్స్యకారులకు ఋణాలు, సామగ్రి సరఫరా, మార్కెటింగ్ సహాయం లాంటి అనేక సహాయ సహకారాలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలో మొత్తం రెండు కోట్ల 20 లక్షల చేప పిల్లలను 957 నీటి వనరులలో విడుదల చేస్తున్నామని ఈ మత్స్య సంపద ద్వారా మత్స్యకారుల ఉపాధి మెరుగు పడుతుందని ఆయన అన్నారు.

# ప్రేమ శాంతి ఐక్యతకు ప్రతీకగా క్రిస్మస్ పండుగ

**(చిన్న - మేడ్చల్ ప్రశ్న న్యూస్ ప్రతినిధి)** క్రిస్మస్ పండుగ కొనసాగుతూ వస్తున్న సంప్రదాయం, ఐక్యతకు ప్రతీక. ముఖ్యంగా క్రైస్తవులకు అత్యంత ముఖ్యమైన పండుగ. యేసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రపంచవ్యాప్తంగా ఘనంగా జరుపుకునే విశిష్టమైన పండుగ. ప్రతియేటా ఈ పండుగను డిసెంబర్ 25వ తేదీన జరుపుకుంటారు. ఈ నేపథ్యంలో క్రిస్మస్ పండుగ వేళ విశేషమైన ప్రాముఖ్యత కలిగిన క్రిస్మస్ చెట్టు గురించి తెలుసుకుందాం. క్రిస్మస్ పండుగ యేసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ 25వ తేదీన జరుపుకునే ముఖ్యమైన పండుగ. ఈ పండుగ శాంతి, ప్రేమ, కరుణ వంటి అంశాలకు ప్రతీక. ఈ క్రిస్మస్ పండుగ వచ్చిందంటే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు, ఇళ్లను అందంగా అలంకరించడం, బంధుమిత్రులు బహుమతులు ఇచ్చిపుచ్చుకోవడం ఆనవాయితీ. అలాగే క్రిస్మస్ పండుగ అంటే మనకు గుర్తొచ్చే మరో అంశం క్రిస్మస్ చెట్టు క్రిస్మస్ పండుగ సందర్భంగా అలంకరించే ఈ చెట్టు చూడటానికి చాలా అందంగా ఉంటుంది. ఇది సాధారణంగా స్ప్రూస్, పైన్ లేదా ఫిర్ వంటి సతతహరిత శంఖాకార చెట్టు. ఈ చెట్టును రంగు రంగుల లైట్లు, నక్షత్రాలు, బొమ్మలతో అలంకరిస్తారు. ఇది శీతాకాలపు పండుగ సంప్రదాయాన్ని సూచిస్తుంది. దీని మూలాలు గమనిస్తే ప్రాచీన కాలం నాటి పండుగల నుంచి వచ్చినట్లు అర్థమవుతోంది. ఈ క్రిస్మస్ చెట్టు సంప్రదాయం జర్మనీ నుంచి ప్రారంభమైనట్లు సమాచారం. 16వ శతాబ్దంలో మార్టిన్ లూథర్ వంటి వారు చెట్లకు క్యాండిల్స్ పెట్టి అలకరించడం ద్వారా ఈ సంప్రదాయం బాగా పొందినట్లు చరిత్ర చెబుతోంది. ప్రాచీన సంస్కృతిలో సతత హరిత చెట్లకు దుష్ట శక్తులను నిరోధించే శక్తి ఉందని నమ్మడం వల్ల ఈ సంప్రదాయం మొదలైనట్లు తెలుస్తోంది. అనంతరం 19వ శతబ్దాంలో క్వీన్ విక్టోరియా భర్త ప్రిన్స్ అల్బర్ట్ దీనిని ఇంగ్లాడ్ కు పరిచయం చేయడంతో ఈ సంప్రదాయం ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. ఈ చెట్టు నిత్య జీవితంలో ఎదురయ్యే చీకట్లను తొలగించి వెలుగును పంచుతుందని నమ్మకం. అలాగే.. అన్యమత యూరోపియన్లలో చెట్లను పూజించడం సర్వసాధారణం. ముఖ్యంగా కఠినమైన శీతాకాలం ఉండే నెలల్లో దుష్టశక్తులను పారదోలడానికి, ఇళ్లను రక్షించడానికి ఈ సతత హరిత కొమ్మలను ఉపయోగించే వారని చెబుతారు. అంతే కాకుండా ఈ ఆచారాలు దెయ్యాలను భయపెడుతాయని.. తద్వారా రక్షణ, శ్రేయస్సును కలిగిస్తాయని ప్రజలు విశ్వసించేవారట. కొన్ని కమ్యూనిటీల్లో క్రిస్మస్ పండుగ సమయంలో పక్షుల కోసం "బహిరంగ ప్రదేశాల్లో చెట్లను కూడా ఏర్పాటు చేస్తారు. ఇలా చేయడం అనేది ప్రకృతితో ఉన్న సన్నిహిత సంబంధాన్ని ప్రతిబింబిస్తుంది. అంతే కాకుండా క్రిస్మస్ పండుగ వేళ క్రిస్మస్ చెట్టు అలంకరణ ఒక ప్రధాన



సంప్రదాయం. ఇది కుటుంబ సభ్యులను, బంధుమిత్రులను ఏకం చేస్తుంది. ఈ క్రిస్మస్ సందర్భంలో ప్రతి ఒక్కరి జీవితంలో ప్రేమ వెలుగులు నిండాలని సమాజంలో శాంతి సౌభ్రాదృత్వం వెల్లి విరియాలని ఆకాంక్షి ద్దాం" క్రిస్మస్ శుభాకాంక్షలు"

## లరిజిస్ట్రేషన్ అధికారుల నివాసాలలో

# ఏసీబీ తనిఖీలు

**మైలవరం** ఇబ్రహీంపట్నం ఇంచార్జ్ సబ్ రిజిస్టర్ మహమ్మద్ భవానిపురం ఇంటి వద్ద ఏసీబీ అధికారులు సోదాలు తెల్లవారుజాము నుంచి నిర్వహించారు. కొద్ది రోజుల క్రితం ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు జరిగిన విషయం తెలిసిందే.

ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్టర్ ఆఫీస్ లో పనిచేస్తున్న సిబ్బందిపై పలు కంప్లైంట్లు రావడంతో సబ్ రిజిస్టర్ మహమ్మద్, భవానిపురం ఇంటి వద్ద, ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్టర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గా పని చేస్తున్న దాసరి దివ్య కొండపల్లిలో ఆర్సిఎం కాలనీ ఇంటి వద్ద ఏసీపీ సత్యనారాయణ ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించారు. మంగళవారం ఉదయం ఏసీబీ అధికారులు సబ్ రిజిస్టర్ కార్యాలయానికి వచ్చి వెళ్లారు. భవానీపురం సబ్ రిజిస్టర్ ఇంటిలో తెల్లవారుజామున నుంచి తనిఖీలు చేసారు.

## ఎమ్మెల్యే రాము కృషితో... గుడివాడలో

# అక్షయపాత్ర కేంద్రీయ వంటశాల

**- నిత్యం పదివేల మందికి మధ్యాహ్నం భోజనం.. అందించనున్న నూతన భవనం**
**- హోమ పూజల్లో పాల్గొన్న కలెక్టర్ బాలాజీ,ఎమ్మెల్యే రాము**
**- ఇస్కాన్ సంప్రదాయం ప్రకారం ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి... భూమి పూజలు చేసిన ఎమ్మెల్యే రాము**
**- అక్షయపాత్ర వంటశాల....గుడివాడలో నిర్మితం కావడం సంతోషకరం**
**- ఎమ్మెల్యే రాము**

గుడివాడ డిసెంబర్ 23: రుచి,శుచి, పోషకాలతో కూడిన ఆహారాన్ని నిత్యం వేలాదిమంది విద్యార్థులకు అందించే అక్షయ పాత్ర ఫౌండేషన్ కేంద్ర వంటశాల గుడివాడలో ఏర్పాటు కావడం సంతోషకరమని ఎమ్మెల్యే రాము హర్షం వ్యక్తం చేశారు. పి 4స్పూర్తితో సంపాదించిన దాంట్లో పదిమందికి ఉపయోగపడేలా భవన నిర్మాణానికి సహకరించిన దాతలు ఆదర్శప్రాయులన్నారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కృషి ఫలితంగా గుడివాడలో అక్షయపాత్ర ఫౌండేషన్ కేంద్రీకృత మధ్యాహ్న భోజన వంటశాల నిర్మాణ పనులు మంగళవారం ఉదయం ప్రారంభం అయ్యాయి. గుడివాడ పట్టణం ఏలూరు రోడ్డులోని ఎఐఖీ ఒ ఎఔః పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో 1.60 ఎకరాల భూమిలో హరే కృష్ణ మూమెంట్ వారి అక్షయపాత్ర ఫౌండేషన్...రూ. 10 కోట్ల నిధులతో నిర్మిస్తున్న కేంద్రీయ మధ్యాహ్న భోజన వంటశాల భవన నిర్మాణ భూమి పూజ కార్యక్రమాలు మంగళవారం ఉదయం ఇస్కాన్ సంప్రదాయం ప్రకారం అత్యంత వైభవంగా జరిగాయి. ముందుగా నిర్వహించిన హోమ పూజల్లో కలెక్టర్ డీకే బాలాజీ, ఎమ్మెల్యే రాము, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొని.... పూర్ణహుతిని సమర్పించారు. అనంతరం అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే రాము... ఇతర ప్రముఖులు భూ వరాహ పూజలు నిర్వహించి... పలుగుతో భూమిని తవ్వుతూ వంటశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

## అత్యవసర కేసులు వచ్చిన వెంటనే

# స్పందించిమెరుగైన సేవలు అందించాలి

**-పెద్దపల్లి జిల్లా 108,102,1962 ప్రాజెక్టుల కోఆర్డినేటర్ జంపాల కుమారస్వామి**
**-మంథనిలో 108 అంబులెన్స్ ఆకస్మిక తనిఖీ**



**మంథని** అత్యవసర కేసులు వచ్చిన వెంటనే స్పందించాలని,24 గంటలు అంబులెన్స్ అందుబాటులో ఉంచి మెరుగైన సేవలు అందించాలని పెద్దపల్లి జిల్లా జిల్లా 108,102,1962 ప్రాజెక్టుల పెద్దపల్లి జిల్లా కోఆర్డినేటర్ జంపాల కుమారస్వామి సిబ్బందికి సూచించారు. మంగళవారం మంథని మాతా శిశు సంరక్షణ కేంద్రం ఆవరణలో 108 అంబులెన్స్ ను పెద్దపల్లి జిల్లా 108,102,1962 ప్రాజెక్టుల పెద్దపల్లి జిల్లా కోఆర్డినేటర్ జంపాల కుమారస్వామి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. గత కొద్ది నెలలుగా మంథని డివిజన్ లో అందిస్తున్న సేవలపై, అత్యవసర సమయంలో వినియోగించే పరికరాల పనితీరును పరిశీలించారు. మందులు, పలు రికార్డులు పరిశీలించి సంతృప్తి చెందారు. గత నెల రోజులుగా వాతావరణం లో ఆకస్మిక మార్పు సంభవించిన నేపథ్యంలో చలి తీవ్రత పెరగడంతో వృద్ధులు చిన్న పిల్లలు అనారోగ్యానికి గురి అయినప్పుడు,అత్యవసర సమయంలో, ప్రజలు అన్ని ప్రమాద సమయాలలో,గర్భిణులను అత్యవసర సమయంలో హాస్పిటల్ తరలించడానికి 108 అంబులెన్స్ ను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో 108 అంబులెన్స్ సిబ్బంది ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ వంశీధర్ రెడ్డి, పైలెట్ హబీబ్, 102 కెప్టెన్ కుమార్, 1962 డాక్టర్ మాళవిక, పారవేట్ పాల్ రమేష్, కెప్టెన్ రమేష్ పాల్గొన్నారు.

# కమిషన్లు మీకు కష్టాలు దళిత బహుజనులక.

**- వై.స్. రాజశేఖర్ రెడ్డి ఇచ్చినపట్టాలు చెల్లబడవా - ఇవి తేల్చాల్సింది స్థానిక అధికారులే**
**- దళిత సంఘాల నాయకులు చిలుక ప్రసాద్ కనుకుంట్ల రమేష్**

**రామగుండం** గోదావరిఖని చౌరస్తా ప్రాంతంలోని మల్లేశం దీక్షకు సంఘీభావం తెలుపుతూ వాళ్ళ కుటుంబాన్ని పరామర్శించి అనంతరం మాట్లాడుతూ గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో నియంత ప్రభుత్వ పాలన నడుస్తుందని నిరుపేదలు దళితులు బహుజన బిడ్డలు ఎంతో కష్టనష్టాలకు వచ్చి స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి ఇచ్చినటువంటి పట్టాల ఆధారంగా తమ నివాస గృహాలను ఏర్పరచుకొని కూలీనాలీ పనులు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న సందర్భంలో ఇప్పుడున్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు పాలకులు అధికార యంత్రాంగం తో రోడ్డు వెడల్పు అభివృద్ధి అనే పేరుతో విధ్వంసకరంగా కూల్చివేస్తూ ఈ ప్రాంతంలోని ప్రజలను భయాందోళనకు గురి చేయడం చేయడమేంటని అన్నారు కేవలం కమిషన్లకు కకృతితో నిరుపేదలైన కుటుంబీకుల ఇండ్లు కూల్చివేస్తూ ఈ కూల్చి వేయడానికి కూడా దళిత కుటుంబాలకు సంబంధించిన కాంగ్రెస్ కార్యకర్తలను ప్రేరేపించి కేసులకు గురిచేయడం దుర్మార్గమైనటువంటి చర్యగా అధికారులను మేము హెచ్చరిస్తున్నాం అంతేకాకుండా ఈ ప్రాంతంలో కూల్చివేతకు గురైనటువంటి వారందరికీ గతంలో స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రివర్యులు రాజశేఖర్ రెడ్డి ఇచ్చినటువంటి పట్టాలు బూటకపు పట్టాలని పాలకులు గాని అధికారులు గాని బహిరంగంగా చెప్పాల్సిన అవసరం ఉంది కానీ ఇది నిజమైన పట్టాలే అని అనుకున్నట్లయితే అక్రమంగా కూల్చివేసిన ఇండ్లకు నష్టపరిహారం కట్టించి వారికి ఇండ్లు కట్టించాల్సిన అవసరం రాష్ట్ర ప్రభుత్వ అధికార యంత్రాంగాంది మరియు ఈ ప్రాంత పాలకులదని మేము డిమాండ్ చేస్తున్నాం లేనిపక్షంలో అన్ని పార్టీలతో అన్ని సంఘాలతో మమేకమై పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలుపుతున్నాం అని అన్నారు ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు గొట్టే రామరాజు విజయ్ కుమార్ సతీష్ ఇందారపు స్వామి గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు

# జనవరి 4న'సిటీ కుక్' పోటీలు

రేడియో సిటీ 91.1 ఎఫ్ఎం ఆధ్వర్యంలో వచ్చే నెల 4వ తేదీన రేడియో సిటీ సిటీ కుక్ పేరుతో వంటల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన సన్నాహక కార్యక్రమంలో భాగంగా మంగళవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని రేడియో సిటీ కార్యాలయంలో సినీ హీరో నాగశౌర్య తల్లి, ఉషా ముల్పూరి కిచెన్స్ వ్యవస్థాపకురాలు ఉషా ముల్పూరి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమం బ్రోచర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రేడియో సేల్స్ హెడ్ విలాష్, ఆర్జే పోటుగాడు(దినేష్)లు మాట్లాడుతూ ఈ వంటల పోటీల్లో పాల్గొనే వారు ఎటువంటి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని పోటీల్లో పాల్గొన్న వారందరికీ బహుమతులు అందజేయడంతో పాటు విజేతలకు ప్రత్యేక బహుమతులు అందిస్తామని వెల్లడించారు. 4వ తేదీన ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామని ప్రపంచంలోని ఏ వంటలనైనా ఈ పోటీల్లో చేయవచ్చునని చెప్పారు. 7715911911 నెంబర్కు వాట్సాప్లో దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు.

## పీవీ నరసింహారావు వర్ధంతి సందర్భంగా

# ఘన నివాళులు




**రామగుండం :** భారత మాజీ ప్రధాని, ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన మహనీయుడు శ్రీ పీవీ నరసింహారావు వర్ధంతి సందర్భంగా ఆయన స్మృతికి ఘన నివాళులు అర్పిస్తున్నాను. బహుముఖ ప్రజ్ఞాశాలి, గొప్ప రాజనీతిజ్ఞుడిగా దేశ చరిత్రలో తనదైన ముద్ర వేసిన పీవీ నరసింహారావు తెలుగువారు కావడం మనందరికీ గర్వకారణం. ఈ సందర్భంగా రామగుండం నియోజకవర్గం శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ కార్పొరేటర్లు వివిధ విభాగాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు

# కొత్త సర్పంచులు... కొన్ని ఆశలు

**పరకాల /నడికూడా** కొత్త సర్పంచ్ లపై ఆయా గ్రామాల ప్రజలకు కొన్ని ఆశలు నెలకొన్నాయి. గాడి తప్పిన గ్రామ పంచాయతీల పాలనను సుపరిపాలన దిశగా నడిపించాలనే ఆశ ప్రజల్లో నెలకొంది. తెలంగాణ ప్రభుత్వం గత 22 నెలలుగా పంచాయతీ ఎన్నికలను నిర్వహించలేదు నాటినుండి ఇటీవల గ్రామ పంచాయతీల పాలకవర్గం కొలువుదీరేవరకు ప్రత్యేక అధికారుల పాలనలో కొనసాగాయి. దాని మూలంగా గ్రామ పంచాయతీల పరిధిలో అభివృద్ధి అడుగంటిపోయిందని స్థానిక సమస్యలను ప్రత్యేక అధికారులు పంచాయతీ కార్యదర్శులు పట్టించుకున్న పాపాన పోలేదన్న అపవాదు నెలకొంది. ఇటు తెలంగాణ ప్రభుత్వం అటు కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు పైసా ఇవ్వకపోవడంతో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారిపోయి అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచాయని ప్రజలు అనుకుంటున్నారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం హైకోర్టు ఇచ్చిన హెచ్చరిక నేపథ్యంలో నవంబర్ నెలలో మూడు విడుదలగా ఎన్నికల నిర్వహించింది ఈ క్రమంలో హనుమకొండ జిల్లాలోని పరకాల డివిజన్లో ని వివిధ మండలాలలోనీ గ్రామాలలో నూతన సర్పంచుల ప్రమాణస్వీకారంతో కొత్తపాలకవర్గాలు కొలువుదీరాయి. దీంతో పంచాయతీలలో అపరిస్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించే విధంగా సర్పంచులు చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామంలో పేరుకుపోయిన పారిశుద్ధ సమస్యతో పాటు ప్రధానమైన మంచినీటి సమస్య గ్రామంలో అంతర్గత రోడ్లు మురుగునీటి కాలువలపై పాలకవర్గం ఒక కన్నేసి పనులను చకచకా నడిపించాలని కోరుతున్నారు

## కలెక్టర్ కు అభినందనలు తెలిపిన తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్



నిజామాబాద్(ప్రశ్న న్యూస్) గ్రామ పంచాయతీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించి, జిల్లా ప్రజల మన్ననలు పొందిన నిజామాబాద్ జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డికి అభినందనలు తెలుపుతూ తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా కమిటీ మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో కలిసి శాలువతో సన్మానించి, మెమొంటో ను బహుకరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అంకిత్, జిల్లా అధ్యక్షులు శిరప్ప హనుమాన్లు, ప్రధాన కార్యదర్శి ఈవీఎల్ నారాయణ, రాధా కిషన్ , సాంబ శివరావు, పురుషోత్తం రావు, భోజరావు, మధుసూదన్, సాగర్, శంకర్, బాలస్వామి, శేఖర్ తదితరులున్నారు.

# రవాణా అదనపు కమిషనర్ అక్రమాస్తులు 12 కోట్లు:అనిశా

కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ప్రముఖుల పై గత కొన్ని రోజులుగా నిఘా పెడుతున్న అవినీతి నిరోధక శాఖ.ఈ నేపథ్యంలో నిన్న మంగళవారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ మహబూబ్ నగర్ అదనపు రవాణా కమిషనర్ కిషన్ నాయక్ ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. ఉదయం 5 గంటల నుండి అనిశా అధికారులు నిర్వహించిన సోదాలలో కిషన్ నాయక్ నుండి 12 కోట్ల పైన విలువైన ఆస్తులకు సంబంధించి ధ్రువ పత్రాలు, డాక్యుమెంట్లు,బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అవినీతి నిరోధక శాఖ డిఎస్పి శ్రీధర్ తెలిపారు. హైదరాబాద్,నిజామాబాద్, కామారెడ్డి ప్రాంతాలలో అక్రమ ఆస్తులను గుర్తించామన్నారు. హైదరాబాదులో ఆరు చోట్ల, నిజామాబాదులో మూడు చోట్ల,నారాయణఖేడ్ లో మూడు చోట్ల సోదాలు నిర్వహించినట్లు తెలిపారు. నారాయణఖేడ్ లో 30 ఎకరాలు,నిజామాబాదులో 10 ఎకరాల భూమికి సంబంధించి అక్రమ ఆస్తులను గుర్తించినట్లు వెల్లడించారు.పాట్ మార్కెట్ లోని



అజిత్ గోల్డ్ దుకాణంలో కిషన్ నాయక్ పేరిట ఉన్న బంగారాన్ని తీసుకువచ్చి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.ఒక కిలో బంగారం తో పాటు,నిజామాబాదులో లహరి అంతర్జాతీయ హొటల్, అపార్ట్మెంట్లకు సంబంధించిన పత్రాలను గుర్తించారు. డాక్యుమెంట్ విలువ ప్రకారం 12 కోట్ల పైగా అక్రమ ఆస్తులు గుర్తించామని బహిరంగ మార్కెట్లో వాటి విలువ రెండింతలు



ఉండవచ్చని ప్రాథమికంగా అంచనాకు వచ్చామన్నారు.దిల్ సుక్ నగర్ లో అతని స్నేహితుడు విజయ్ ఇంట్లో పలు డాక్యుమెంట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నామని స్పష్టం చేశారు.కిషన్ నాయక్ ను అరెస్టు చేసిన ఏసీబీ అధికారులు కస్టడీలోకి తీసుకొని మరిన్ని వివరాలు రాబడుతామని తెలిపారు.

## ఎన్జీవో అధ్యక్షుడికి ఘన సత్కారం



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ ఎన్జీవో శ్రీకాళహస్తి తాలూకా అధ్యక్షుడుగా నూతనంగా ఎన్నికైన చెంచురత్నం యాదవ్ ను తొట్టంబేడు మండలం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గాలి మురళి నాయుడ ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా గాలి మురళి నాయుడు మాట్లాడుతూ చెంచు రత్నం యాదవ్ కు అభినందనలు తెలియజేస్తూ బాధ్యతాహితంగా విధులు నిర్వహించాలని ఆయన కోరారు.ఉద్యోగ సంఘ నాయకులకు ఏపీ ఎన్జిజిఓ సభ్యులకు ఉద్యోగస్తులకు ఎటువంటి సమస్యలు వచ్చిన వెంటనే పరిష్కరించవలసిందిగా ఈ సందర్భంగా ఆయన కోరుకున్నారు, చెంచురత్నం యాదవ్ మాట్లాడుతూ గత పదిసంవత్సరాలుగా ఎన్జీవో శ్రీకాళహస్తి పట్టణ అధ్యక్షుడిగా ఉంటూ ఉద్యోగ సంఘాల నాయకులకు, ఉద్యోగస్తులకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేశానని అన్నారు.

## విద్యార్థులు పదవ తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించేలా నాణ్యమైన బోధన అందించాలి

**మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఉపాధ్యాయులకు సూచించారు.**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) మంగళవారం కొల్చారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ను కలెక్టర్ తనిఖీ చేశారు.పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను ప్రశ్నలు జవాబుల రూపంలో పరీక్షించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అక్కడ జరుగుతున్న విద్యాబోధన, ఉపాధ్యాయులు, విద్యార్థుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు గుణాత్మకమైన విద్య బోధన అందించడంతో పాటు సమయానికి నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలన్నారు. పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పాఠశాలల తరగతి గదులు, పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచి, పిల్లలకు అనువైన వాతావరణాన్ని కల్పించాలని, పరీక్షలు సమయం సమీపిస్తున్న తరుణంలో ఉత్తీర్ణత శాతం మెరుగు పర్చుటకు ప్రత్యేక క్లాసులను నిర్వహించి, పిల్లలలో ఏకాగ్రతను పెంచుటకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి, వారి అభ్యున్నతికి పాటుపడాలని టీచర్లను కలెక్టర్ ఆదేశించారు. పరీక్షల సమయం దగ్గర పడుతున్నందున విద్యార్థులు కష్టంగా కాకుండా ఇష్టంగా చదివి మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రాజ్ కుమార్ నియామకం యువ న్యాయవాదులకు ప్రేరణ

**- వేములవాడ పట్టణ బీజేపీ అధ్యక్షులు : రాపెల్లి శ్రీధర్**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పట్టణానికి చెందిన న్యాయవాది రేగుల రాజ్ కుమార్‌ను తెలంగాణ హైకోర్టులో కేంద్ర ప్రభుత్వ తరఫున వాదించే న్యాయవాదిగా కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ నియమించడం గర్వకారణమని భాజపా వేములవాడ పట్టణాధ్యక్షులు రాపెల్లి శ్రీధర్ అన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ "వేములవాడకు చెందిన న్యాయవాదికి కేంద్ర ప్రభుత్వ బాధ్యత లభించడం మా ప్రాంతానికి గౌరవం. రాజ్ కుమార్ న్యాయ పరిజ్ఞానం, క్రమశిక్షణ, అంకితభావంతో కేంద్ర ప్రభుత్వానికి సమర్థంగా సేవలందిస్తారని విశ్వసిస్తున్నాం. యువ న్యాయవాదులకు ఆయన నియామకం ప్రేరణగా నిలుస్తుంది" అని పేర్కొన్నారు. రాజ్ కుమార్‌ను ఆయన ఘనంగా అభినందించి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత బాధ్యతలు అందుకోవాలని ఆకాంక్షించారు.2016 నుంచి తెలంగాణ హైకోర్టులో ప్రాక్టీసింగ్ అడ్వకేట్‌గా కొనసాగుతున్న రాజ్ కుమార్ పలు బ్యాంకులకు లీగల్ అడ్వైజర్‌గా, వివిధ సంస్థలకు న్యాయ సేవలు అందిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందారని శ్రీధర్ తెలిపారు.ఈ నియామకానికి సహకరించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ గోకుల్ రామారావు, బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపిలకు రాజ్ కుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు. వేములవాడ ప్రాంతానికి చెందిన న్యాయవాదికి కేంద్ర స్థాయిలో బాధ్యత లభించడంతో స్థానికంగా హర్షం వ్యక్తమైంది.

## సర్పంచ్ బాధ్యతల అనంతరం తొలి సేవా కార్యక్రమంలో భాగస్వామ్యం హర్షణీయం

**-గొర్రెల ఆరోగ్యం - పెంపకం దారులకు ఆర్థిక బలం**

**- విలాసాగర్ గ్రామ సర్పంచ్ : ఏనుగుల కనుకయ్య**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని విలాసాగర్ గ్రామంలో గొర్రెల ఆరోగ్య సంరక్షణలో భాగంగా మంగళవారం నట్టల మందు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విలాసాగర్ నూతన సర్పంచ్ ఏనుగుల కనుకయ్యతో పాటు వార్డు సభ్యులు,వెటర్నరీ డాక్టర్ శ్రీధర్,నరేందర్,గొర్రెల పెంపకదారులు,గొర్రెల పెంపకదారుల సహకార సంఘం అధ్యక్షుడు దయ్యాల కొమురయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండోసారి సర్పంచి గా బాధ్యతలు స్వీకరించిన నూతన సర్పంచ్ ఏనుగుల కనుకయ్య మాట్లాడుతూ "సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా గ్రామ సర్పంచ్ హోదాలో ఈ కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉంది. గ్రామంలో గొర్రెల పెంపకం అనేది అనేక కుటుంబాలకు ప్రధాన జీవనాధారం. గొర్రెల ఆరోగ్యం కాపాడితేనే పెంపకదారులకు లాభాలు వస్తాయి. అందుకే ప్రభుత్వం, పశుసంరక్షణ శాఖ సహకారంతో ఇలాంటి నట్టల మందు పంపిణీ కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నాం. భవిష్యత్తులో కూడా గొర్రెల పెంపకదారులకు అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తాం" అని, మందులు వేయడం వల్ల గొర్రెల ఆరోగ్యం మెరుగుపడి ఉత్పాదకత పెరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం సహకార సంఘం అధ్యక్షుడు దయ్యాల కొమురయ్య ఈ కార్యక్రమం గొర్రెల పెంపకదారులకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. గ్రామంలో ఇలాంటి పశుసంరక్షణ కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు.

## మల్కాపూర్ ప్రధాన కూడలిలో ఎల్ఈడి బల్బులు ఏర్పాటుకు విజ్ఞప్తి

**- ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం హామీ**

**- మల్కాపూర్ గ్రామ ప్రజల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు**

**- కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ సర్పంచ్ : కోరెపు నరేష్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని మల్కాపూర్ గ్రామ ప్రధాన కూడలి వద్ద ఎల్ఈడి బల్బులు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు,మల్కాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ కోరెపు నరేష్ మంగళవారం చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం ను కోరారు. గ్రామంలో రాత్రి వేళ సరైన వెలుతురు లేక ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ వినతికి తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం మల్కాపూర్ గ్రామ ప్రధాన కూడలిలో ఎల్ఈడి బల్బులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల భద్రత, రవాణా సౌకర్యం దృష్ట్యా ఈ సమస్యను వెంటనే పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కోరెపు నరేష్ మాట్లాడుతూ, "మల్కాపూర్ గ్రామ ప్రధాన కూడలి వద్ద వెలుతురు లేక రాత్రివేళ ప్రమాదాల అవకాశం ఉంది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగానే వెంటనే స్పందించి ఎల్ఈడి బల్బులు ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం ఆనందంగా ఉంది. ఎమ్మెల్యే సహకారంతో త్వరలోనే గ్రామ ప్రధాన కూడలి వెలుగులతో మెరుస్తుందని గ్రామ ప్రజలు ఆశిస్తున్నారు" అని,గ్రామ ప్రజల పక్షాన ఎమ్మెల్యే సత్యం కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని నరేష్ పేర్కొన్నారు.

## ఆశా వర్కర్స్ కు రావలసిన పెండింగ్ బిల్స్ మంజూరు చేయాలి



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) ఆశా వర్కర్స్ కు రావలసిన పెండింగ్ బిల్స్ ను వెంటనే విడుదల చేయాలని సిఐటియు మండల కార్యదర్శి ఎం నరేష్ కోరారు.ఆశ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో యూ పి హెచ్ సి ముందు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మేడ్చల్ మండల కార్యదర్శి ఎం. నరేష్ మాట్లాడుతూ ఆశ వర్కర్స్ కి ఇవ్వాల్సిన పెండింగ్ డబ్బులను ప్రభుత్వం వెంటనే రిలీజ్ చెయ్యాలని డిమాండ్ చేశారు.లెప్రసీ సర్వే డబ్బులు, గతం నుండి పెండింగ్ లో ఉన్న డబ్బులను, ప్రభుత్వం ఇంకా బడ్జెట్ రిలీజ్ చేయలేదని బడ్జెట్ ఎప్పుడు రిలీజ్ చేస్తుందో గ్యారెంటీ లేదని ఆరోపించారు. పెండింగ్ లెప్రసీ ఇతర బిల్లులను వెంటనే చెల్లించాలని, ఫిక్స్ వేతనం రూ.18 వేలు, ఇవ్వాలని ఇతర డిమాండ్స్ పరిష్కారం చెయ్యాలని కోరారు.ఈ నెల డిసెంబర్ 27న కలెక్టర్ ఆఫీసు ముందు ధర్నా, డిసెంబర్ 29న కమీషనరేట్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చెయ్యాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ నాయకులు వసంత, పద్మ, సునీత, సునంద, మమత, రాణి, లావణ్య, రాజమణి, మంజుల, తులసి, రాజకుమారి, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సెయింట్ పీటర్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



మేడ్చల్( ప్రశ్న న్యూస్) మేడ్చల్ జిల్లా గుండ్ల పోచంపల్లి జిహెచ్ఎంసి పరిధి మైసమ్మ గూడా లోని సెయింట్ పీటర్స్ ఇంజనీరింగ్ కళాశాలలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచం మొత్తం క్రిస్మస్ వేడుకలను జరుపుకుంటుందని తెలిపారు. క్రిస్మస్ అనేది మేరీ ద్వారా జీసస్ ని ఈ ప్రపంచంలోకి పంపిన రోజనని, ఒక చిన్న పశువుల పాకలో జన్మించారని తెలిపారు. క్రిస్మస్ ద్వారా ఇచ్చిపుచ్చుకోవడం సంతోషాన్ని పంచుకోవడం క్రిస్మస్ పర్వదినాన్ని జరుపుకుంటామని పేర్కొన్నారు. ఒకరికొకరు థ్యాంక్స్ గివింగ్ అనే కార్యక్రమం ద్వారా బియ్యము బట్టలు తదితర నిత్యవసర వస్తువులు ఇవ్వడం ద్వారా వీటిని వృద్ధాశ్రమాలకు అనాథ పిల్లలకు విరాళాలుగా ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులు పాటలతో ఆకట్టుకున్నారు. శాంతా క్లాస్ అభివాదం చేస్తూ విద్యార్థులకు స్వీట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఏ రామస్వామి రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ సరోజా రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ అనురాగ్ రెడ్డి పిఆర్ఓ రవి సుధాకర్, వివిధ భాగాధిపతుల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## క్రిస్మస్ పండుగ స్ఫూర్తితో ఐక్యత ,సమానత్వం పాటించాలి

**- చొప్పదండి నియోజకవర్గ క్రైస్తవులకు ముందస్తు "క్రిస్మస్ పండుగ" శుభాకాంక్షలు**

**- ప్రముఖ సామాజిక వేత్త, టీఎల్ యువసేన అధినేత : తూడి లచ్చన్న**



గంగాధర (ప్రశ్న న్యూస్) చొప్పదండి నియోజకవర్గం క్రైస్తవ సోదర సోదరీమణులకు ప్రముఖ సామాజిక వేత్త, టీఎల్ యువసేన అధినేత తూడి లచ్చన్న ముందస్తు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "క్రిస్మస్ పండుగ ప్రేమ,కరుణ, త్యాగం అనే విలువలను మనకు గుర్తు చేస్తుంది. కులం, మతం, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ మానవత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలి. సమాజంలో బలహీన వర్గాలకు అండగా నిలబడటం,అవసరమైన వారికి సహాయం చేయడమే నిజమైన పండుగ స్ఫూర్తి. చొప్పదండి నియోజకవర్గం సౌభ్రాతృత్వం,ఐక్యతతో ముందుకు సాగాలని,యువత మంచి మార్గంలో నడిచి సమాజ మార్పుకు నాయకత్వం వహించాలని కోరుకుంటున్నాను" అని అన్నారు.అన్ని వర్గాల ప్రజలు సుఖశాంతులతో, ఆరోగ్యంగా ఉండాలని లచ్చన్న ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

## ఈనెల 28 న జరిగే గొర్రెపాటి మాధవరావు స్మారకోపన్యాసం



నిజామాబాద్(ప్రశ్న న్యూస్) ఈనెల 28 న జరిగే మానవ హక్కుల వేదిక రాష్ట్ర మాజీ అధ్యక్షులు గొర్రెపాటి మాధవరావు ప్రథమ వర్ధంతి సందర్భంగా లి"స్మారకోపన్యాసం "లి సభను విజయవంతం చేయాలని మానవ హక్కుల వేదిక నిజామాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గడ్డం గంగులు, జి రమేష్ లు కోరారు.ఈ సందర్భంగా నిజామాబాద్ నగరంలో మానవ హక్కుల వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎల్లమ్మ గుట్టలో గొర్రెపాటి మాధవరావు స్మారకోఉపన్యాస సభ పోస్టర్లను ఆవిష్కరించడం జరిగింది .మానవ హక్కుల వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగే ఈ సభకు ముఖ్య వక్తలుగా నల్సార్ న్యాయ శాస్త్ర యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ శ్రీ కృష్ణ దేవరాజు ,మానవ హక్కుల వేదిక ఉభయ రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యులు జీవన్ కుమార్, తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు యం.రాజేందర్ రెడ్డి, జంపాలా చంద్రశేఖర్ ప్రసాద్ మెమోరియల్ ట్రస్ట్ ట్రస్టీ ఆకుల పాపయ్య, నిజామాబాద్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు ఆకుల రమేష్, నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు మామిళ్ల సాయిరెడ్డి హాజరవుతారని తెలిపారు. మాధవరావు హక్కులు లేని అణిచివేతకు గురయ్యే వర్గాల పట్ల ఆరాటాన్ని తన జీవిత ఆచరణలో భాగం చేసుకున్నారు. ఎన్నో ఎన్కౌంటర్ హత్యలు, లాకప్ మరణాలను పరిశీలించి అవి ఎట్లా చట్ట వ్యతిరేకమో విశ్లేషించాడు. కోర్టుల్లో వాటిని సవాల్ చేసి దేశంలో అర్థుగా నమోదయ్యే ఎన్కౌంటర్ మృతుల కుటుంబాలకు పరిహారం ఇచ్చే తీర్పులను రాబట్టాడు. తన జీవితాంతం హక్కుల అణిచివేత కు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు చేశాడు. మానవ హక్కుల సంస్కృతి మానవాళి నిజమైన అభివృద్ధి అని నమ్మి పనిచేశాడు. కావున ప్రజాస్వామ్యవాదులు, కార్మికులు, రైతులు అన్ని వర్గాల ప్రజలు ఈ సభను విజయవంతం చేయాలని కోరుతున్నాం. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక జిల్లా కోశాధికారి ఆకుల సత్యనారాయణ జిల్లా కమిటీ సభ్యులు న్యాయవాదులు మీనా సహాని, అన్వేష్, రిటైర్డ్ జడ్జ్ కృష్ణ గోపాల్ రావు, న్యాయవాదులు బాస పవన్ ప్రసాద్, సంతోష్, ఆదిత్య మధుమిత్, సురేష్ తదితరులు హాజరైనారు.

## వరంగల్ లో పిడిఎస్ యురాష్ట్ర 23వ మహాసభలను విజయవంతం చేయండి




నిజామాబాద్(ప్రశ్న న్యూస్)జనవరి 5 ,6 ,7 తేదీలలో వరంగల్ జిల్లా కేంద్రంలో జరిగే పి డి ఎస్ యూ 23వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పి డి ఎస్ యూ నిజామాబాద్ నగర అధ్యక్షులు సిర్రం పవన్ కుమార్ కోరారు.మాక్లూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు పి డి ఎస్ యూ ఆధ్వర్యంలో రాష్ట్ర మహాసభల పోస్టర్స్ ఆవిష్కరించటం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉద్యమాల పురిటి గడ్డైన ఉస్మానియా యూనివర్సిటీ లో 1970వ దశకంలో భగత్ సింగ్ చేగువేరా వీరోచిత పోరాటాల స్ఫూర్తితో, నక్సల్ బరి, శ్రీకాకుళం, గోదావరి లోయ పోరాటాల ఒరవడిని కొనసాగిస్తూ పురుడు పోసుకున్న ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ( పి డి ఎస్ యూ) శాస్త్రీయ విద్యా సాధన,సమసమాజ స్థాపనే లక్ష్యంగా, సమాజంలో ఉన్న అన్ని అసమానతలకు వ్యతిరేకంగా, అందరికీ సమానమైన, నాణ్యమైన విద్య కోసం అర్ధశతాబ్దం పైగా పోరాడుతుంది. విద్యార్థి ఉద్యమంలో అనేకమంది అమరవీరులయ్యారని అన్నారు.నేడు విద్యారంగం సమస్యల వలయంలో చిక్కుకుందని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వారి అనుకూల విధానాలను విద్యలో అవలంబిస్తున్నారని, విద్యార్థి ఉద్యమాన్ని మరింత పదునేక్కించడం కోసం ఉద్యమ కార్యచరణ రూపొందించడం కోసం విప్లవాల గడ్డ వరంగల్ జిల్లా కేంద్రంలో జనవరి 5 6 7 తేదీలలో జరిగే పిడిఎస్ యు రాష్ట్ర 23 వ మహాసభలను జయప్రదం చేయాలని విద్యార్థులు మరియు అన్ని వర్గాల ప్రజలను కోరుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో పి డి ఎస్ యూ నాయకులు గంగాసోని, ప్రవీణ, లావణ్య, శ్రీజ, రాకేష్, చరణ్, రామ్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

## లింగ సమానత్వంతోనే అభివృద్ధి

- విద్యార్థులకు లింగ సమానత్వం,గుడ్ టచ్ - బ్యాడ్ టచ్ పై అవగాహన
- ఏఐఎఫ్ - ఈవై స్కిల్ బ్రిడ్జ్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అవగాహన






సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమెరికన్ ఇండియా ఫౌండేషన్ – ఈవై స్కిల్ బ్రిడ్జ్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో, రాజన్న సిరిసిల్ల జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంతో కలిసి విద్యార్థినీ–విద్యార్థులకు లింగ సమానత్వంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా లింగ వివక్షత, గుడ్ టచ్–బ్యాడ్ టచ్, లింగ సమానత్వం వంటి అంశాలపై విద్యార్థులకు స్పష్టమైన అవగాహన కల్పించారు. సమాజంలో సమానత్వ భావన పెంపొందించుకోవాలని, తమ హక్కులు– బాధ్యతలను గుర్తించుకోవాలని వక్తలు సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగుల రమాదేవి, ఫౌండేషన్ జిల్లా కో –ఆర్డినేటర్ మహేందర్, కో– ఆర్డినేటర్లు మమత,స్వప్న,జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం నుంచి దేవిక,జనార్ధన్,శ్రావణి, పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణా పై బిఆర్ఎస్ పోరాటం .

**45 రోజులుగా ఇసుక తరలిస్తిన్న పట్టించుకోని రెవిన్యూ,పోలీస్ ,ఇరిగేషన్ , ఫారెస్ట్ అధికారులు.**

**ఎలాంటి అనుమతులు లేకుండా ఎమ్మెల్యే తన అనుచరులతో అక్రమ రవాణాకు పాల్పడుతున్నాడు.**

**ఇదేమిటని అడిగిన వారి పైన ఎమ్మెల్యే అనుచారులు బెదిరింపులకు పాల్పడుతున్నారు.**

**బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు యం పద్మా దేవేందర్ రెడ్డి . నర్సాపూర్**



ఎమ్మెల్యే సునిత లక్ష్మారెడ్డి మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్) మెదక్ మండలం సంగాయిగూడ తండా హల్దీ వాగులో అధికార పార్టీ నాయకులు రోడ్ వేసి మరి 45 రోజులుగా అక్రమంగా ఇసుకను జహీరాబాద్, బీదర్, హైదరాబాద్ తరలిస్తున్నరు.వాగులో క్వారీ ఏర్పాటు చేసుకొని ఇసుక తరలిస్తున్నారు. సోమవారం హల్ది వాగు వద్దకు వెళ్లి ఇసుక తరలింపు ప్రాంతాన్ని పరిశీలించిన మాజీ డిప్యూటీ స్పీకర్,బిఅర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు యం.పద్మ దేవేందర్ రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి,ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి. సుభాష్ రెడ్డి, నాయకులు కంఠరెడ్డి. తిరుపతి రెడ్డి,మెదక్ మండల పార్టీ అధ్యక్షులు యం. అంజ గౌడ్,మండల నాయకులు తదితరులు. హల్ది వాగు నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని ఖండిస్తూ హల్ది వాగు వద్ద నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గత నెల 45 రోజులుగా ఇసుక దొంగ రవాణా జరుగుతోంది. ఇక్కడున్న అధికారులు, పోలీసులు, శాసనసభ్యులు, కాంగ్రెస్ నాయకులకు వత్తాసు పలుకుతున్నారు. ఇక్కడి ఇసుకను హైదరాబాద్, బీదర్‌కి తరలించేస్తున్నారు. రాత్రికి రాత్రి పెద్ద పెద్ద హిటాచిలు పెట్టి, వేల టిప్పర్ల ద్వారా తరలించేస్తున్నారు. ఇక్కడ రోడ్లు ఖరాబైనా పట్టించుకోవట్లేదు. ఇక్కడ పంటలకు నీళ్లు నిలవకపోతే పంటలకు, రైతులకు నష్టం జరుగుతుంది అనే సోయి లేకుండా అనేక వేల టిప్పర్లలో హైదరాబాద్ నగరానికి ఇసుక తరలిస్తున్నారు. కానీ, ఇక్కడ ఇందిరమ్మ ఇళ్లకు, గుడికి, బడికి ఇసుక ఇస్తలేరు. ఎటువంటి ప్రభుత్వ పనులూ జరగట్లేదు. వాటికి ఇసుక లేదు. కానీ, బీదర్‌కి, హైదరాబాద్‌కి మాత్రం ఇసుక తరలిస్తున్నారు. నవంబర్ 21 తేదీన కలెక్టర్ రాహుల్ రాజ్ ను కలసి రిప్రజెంటేషన్ ఇచ్చి ఇసుక రవాణాను, దందాను ఆపాలని కోరినప్పటికీ ఎటువంటి స్పందన లేదు. గ్రామపంచాయితీ ఎన్నికలు జరిగిపోయిన తర్వాత యాక్షన్ తీసుకుంటారని అనుకున్నాం. కానీ, ఇప్పుడు ఇంకా ఎక్కువ చేస్తున్నారు. నిజనిర్ధారణ కమిటీ మేం వస్తున్నామని తెలిసి, మమ్మల్ని రాకుండా అడ్డుకట్టలు వేసి, ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేశారు. కానీ, ఈ అడ్డుకట్టలేమీ మమ్మల్ని ఆపలేవు. మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల ప్రజలకు ఉపయోగపడే ఇసుక ఇది. దీన్ని తరలిస్తే రైతులకు నష్టం జరుగుతుంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేగా అధికారం ఇచ్చింది ఈ ఇసుకను దోచుకోవడానికేనా? అని మేం ప్రశ్నిస్తున్నాం. రేవంత్ రెడ్డి నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు ఏం దొరికితే అది దోచుకుని తెలంగాణకు నష్టం చేస్తున్నరు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. పోలీసు డిపార్ట్ మెంట్ కూడా పట్టించుకున్న పాపాన పోలేదు. వేల టిప్పర్లు ఇక్కడ నడుస్తుంటే ప్రజలు ఆపే ప్రయత్నం చేస్తే వాళ్లను చంపేస్తామని బెదిరించడం, వాళ్లమీద పోలీసు కేసులు పెడతామని బెదిరించడం ఎంతవరకు సమంజం? కలెక్టర్‌కి, పోలీసులకు ఇవి కనబడ్తలేవా? మళ్లా ఇంత ఇసుక రవాణా జరుగుతోందని ప్రజలు, రైతులు మొత్తుకుంటా ఉంటే వాళ్లే మేం ఇసుక రవాణాను ఆపేస్తాం అని ప్రెస్ స్టేట్‌మెంట్లు ఇస్తున్నారు. కలెక్టర్, ఎస్పీకి చెప్పినట్లు యాక్షన్ చేస్తున్నారు. వాళ్ల సపోర్ట్ తోనే ఇసుక పోతోంది. ఇసుక కొడుతోందే వాళ్లు. మళ్లీ వాళ్లే దొంగే దొంగ అన్నట్లుగా ఇసుక రవాణాను అరికడతాం అంటూ నాటకాలు, బూటకాలు ఆడుతున్నారు. ఇసుక పోతే రైతులకు నీళ్లు ఆగవు. నీళ్లు నిలిచే పరిస్థితి ఉండదని అన్నారు. మెదక్ ఎమ్మార్వో లక్ష్మణ్ ఎస్ఐ లింగం సంఘటన స్థలానికి వచ్చారు. ఇన్ని రోజులుగా ఇసుక రావన్న జరుగుతున్న మీరు ఏం చేస్తున్నారని వారిని పద్మ దేవేందర్ రెడ్డి ప్రశ్నించారు. వెంటనే హిటాచిలను టిప్పర్లను స్వాధీనం చేసుకొని సీజ్ చేయాలని సూచించారు. ముందస్తు సమాచారం తెలుసుకొని అక్రమ ఇసుక రవాణా ఆపివేసి హల్దీ వాగులోకి వెళ్లకుండా పెద్ద గుంతలు తీసి హిటాచీలను కొంగోడు శివారులో పెట్టారు. అక్కడికి బిఆర్ఎస్ బృందం చేరుకొని స్థానిక కొల్చారం ఎమ్మార్వో శ్రీనివాస్ ఎస్ఐకి సమాచారం అందివ్వగా సంఘటన స్థలానికి చేరుకున్న ఎమ్మార్వో ఎస్సై ఒక కంటైనర్ ను ఎలాంటి నెంబర్ ప్లేట్ అధరాలు లోని 3 హిటాచిలను సీజ్ చేసి కొల్చారం పీఎస్ కు తరలించారు. అనంతరం బిఆర్ఎస్ బృందం మెదక్ కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాహుల్ రాజును కలిసి 45 రోజులుగా అక్రమ ఇసుక రవాణా చేస్తున్న అధికారులు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హల్దీ వాగుల నుండి ఇసుకను తరలిస్తున్న ప్రాంతాన్ని వేసిన రోడ్ ఫోటోలను వీడియోలను కలెక్టర్కు చూపించారు. వెంటనే అక్రమ ఇసుక రవాణాలను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను విజ్ఞప్తి చేశారు. లేనియెడల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నాలు రాస్తారోకోలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు యం. లావణ్య రెడ్డి, మెదక్ మండల పార్టీ అధ్యక్షులు ఎం అంజ గౌడ్, మాజీ ఎంపీపీ కొత్తపల్లి . కిష్టయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి,పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ళ ఆంజనేయులు,మాజీ సర్పంచ్లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ కౌన్సిలర్లు,మండల,పట్టణ నాయకులు తదితరులు ఉన్నారు.

# తల్లి కడుపు కోత,నిఖిత కడుపు తీత: ఇటుక గోపి

- నిఖితకునూరేళ్ళ,నిందుతుడికి"రాజయోగమా":బాధిత తల్లీ ఆవేదన
- ప్రేమ పేరుతో కాటేసిన కన్నింగ్ కిషోర్,అమాయకుడిలా కటింగ్లు,పోలీసులను తప్పు దోవపట్టిస్తున్నాడు: టిఎమ్మార్పీఎస్
- పసిప్రాయాన్ని కబలించిన కామాంధుడు,హెచ్ఆర్సీ, డిజిపి కి ఫిర్యాదు చేసిన కుటుంబ సభ్యులు
- దళిత బిడ్డ పై కామవాంఛ, గర్భం,అబార్షన్,మరణం, సమాజమా ఏమిటి ఘోరం: టిఎమ్మార్పీఎస్ నేత గోపి
- అఖిలం,నిఖిలం,హద్దులు దాటిన ప్రేమ అనంత లోకాలకు నిఖిత పయనమా.?
- "5"నెలల గర్భిణి అబార్షన్ చేసిన వైద్యులపై చర్యలేవీ.?
- ఇండియన్ మెడికల్ కౌన్సిల్ యాక్ట్ ప్రకారం డాక్టర్ లైసెన్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్న ఎస్.అభిషేక్








హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఆయన మాయ మాటలకు ఆమె బలైంది.ప్రేమికుడు ప్రేమలో ఆమె లోతులోకి జారిపోయింది. ప్రపంచాన్నే మరిచేల ప్రేమికుడు ప్రియురాలికి దగ్గరైయ్యాడు.ప్రతి రోజూ గాల్లో తేలుతూ,ఆకాశంలో విహరించేలా కల్లిబొల్లి మాటలతో ఒక్కటైయ్యాడు. చివరకి మగవాడు మృగంల మారి తన జీవితాన్ని కబలించి,నయవంచనకు గురైనట్లు నగరంలో ఓ ప్రేమ కథ ఆలస్యంగా వెలుగులోకి రావడంతో ఆ పసితల్లి ఇంట్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

### ఇలా మొదలై,అలా అనంత లోకాలకు శామలపల్లి నిఖిత..

హైదరాబాద్ జంట నగరాల్లో ప్రేమ పేరుతో కాటేస్తున్న కాలనాగులు.మహానగరంలో ప్రతి రోజూ ఏదో చోటు ప్రేమ పేరుతో బలి పీఠం ఎక్కుతున్న పసి కూనలు(అమాయక ప్రాణాలు).సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఉన్న మూడోవ వార్డులో అంబేద్కర్ నగర్,సిఖ్ విలేజ్ ,మడ్ ఫోర్డ్ లోనివసిస్తున్న 22 సంవత్సరాల శామలపల్లినిఖిత.తండ్రి:శామలపల్లి.రాజు,తల్లి: శామలపల్లి బాలమణి,సొదరుడు:ఎస్: అభిషేక్.ఈ మధ్యనే డిగ్రీ పూర్తి చేసిన ఈ బంగారు తల్లి.ఆమె బంగారు భవిష్యత్తు కోసం ఉన్నత చదువుతో జీవితాన్ని తీర్చుదిద్దుకుంటున్న సమయంలో ప్రేమ పేరుతో తన జీవితంలోకి ప్రవేశించిన ఓ కామాంధుడు.ప్రేమ,దోమఅంటూ లైఫ్ నే కాటేసిన మేడ్చల్ జిల్లా జవహర్ నగర్ వాసి కిషోర్.అందమైన శామలపల్లి నిఖితను ప్రతి రోజూ ఫోన్ చేసి మాయ మాటలు చెప్పి హైదరాబాద్ మహానగరంలో ఉన్న పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ పొద్దేకే దాకా తిరుగుతూ చీకటి పడగానే సిఖ్ విలేజ్ లో వదిలేవాడు.కాలక్రమేనా ఓరోజు సారూ మనం ఇద్దరం ఒక్కటి కావాలంటే మన ప్రతిరూపం పురుడు పోసుకోవాలనీ ఆమె ప్రతి సారి ఒత్తిడి చేసెవాడు.ప్రేమించాడు,మంచివాడు,జీవితాంత ం తోడు ఉంటాడని నమ్మిన నిఖిత.పెళ్లికి ముందు జరగరాని వ్యవహారం జరగడం వల్ల జీవితం చెయ్యి జారిపోయింది.అలా ఇద్దరి మధ్య బంధం బలంగా మారడంతో కుటుంబంలో సమస్యలు తలెత్తుతాయని శామలపల్లి నిఖిత కిషోర్ నిప్రతి రోజూ కడుపులో ఉన్న బిడ్డ విషయాన్నినిలదీయడంతో ఇదిగో అదిగో అంటూ కాలయాపన చేస్తూ కన్నీళ్లకు చిరునామాగా చేసిన కామాంధుడు.తప్పదని గ్రహించాడో ఏమో కానీ ఓ మాస్టర్ ప్లాన్ తో నిఖితను ఆశ్రయించాడు.వీలైనంత త్వరగా కడుపులో ఉన్న బిడ్డను అబార్షన్ చేస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందని,అలాగే వేంటనే ఏదైనా గుడిలో వివాహం చేసుకుందామని మళ్ళీ మాయ మాటలు చెప్పి అబార్షన్ ప్లాన్ మొదలు పెట్టాడు.

అబార్షన్ ప్లాన్ వికటించి,తల్లి, బిడ్డ మరణం: మేడ్చల్ జిల్లా మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని జవహర్ నగర్ లో నివాసం ఉంటున్న కిషోర్.అదే ప్రాంతంలో ఉన్న బాలాజీ హాస్పిటల్ వైద్యుల చేత ఐదు నెలల గర్భవతి అయిన శామలపల్లి నిఖితకు అబార్షన్ చేయడంతో ఇద్దరు మరణించారు.నిఖిత చనిపోయిందని విషయం తెలుసుకున్న కిషోర్ సంఘటన స్థలం నుంచి పరారైనట్లు విశ్వసనీయ సమాచారం.?

### న్యాయం కోసం పోరాటం, శామలపల్లి నిఖిత కుటుంబం..

తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ లో ఫిర్యాదు.జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ లోని ఎస్సై, ఇన్స్పెక్టర్ పై విచారణ చేసి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని.నిందితుడు కిషోర్ పై కూడా ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని,అలాగే ఇండియన్ మెడికల్ కౌన్సిల్ యాక్ట్ కింద:వైద్య నిబంధనలకు విరుద్ధంగా అబార్షన్ చేసిన డాక్టర్ పై హాస్పిటల్ పై సమగ్ర విచారణ చేసి చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని శామలపల్లి కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతానికి చెందిన ఎస్.నికిత 22, సం"లు, ప్రేమిస్తున్నాను పెళ్లి చేసుకుంటాను అని మాయమాటలు కిషోర్ అనే వ్యక్తి 5, నెలల గర్భవతిని చేసినాడు. గర్భం తొలగించడానికి బాలాజీ నగర్ లోని బాలాజీ హాస్పిటల్ లో డాక్టర్ చేత అబార్షన్ చేయించాడు.అమ్మాయి కడుపులోని బిడ్డ మరణించారు. ఈ విషయంలో జవహర్ నగర్ పోలీసులు తేది: 16/08/2025, నా ఎఫ్ఐఆర్ నెంబర్: 933/2025,బిఎన్ఎస్–ఎస్ 194 క్రింది కేసు నమోదు చేసిన విషయం విదితమే.కానీజవహర్ నగర్ పోలీసులు మాత్రం ఎస్.నికిత మరణం తర్వాత ఆమె కుటుంబ సభ్యులు వివరణ అడగకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేయడం తప్పు పడుతున్నారు.అలాగే చేసే విచారణ కూడా ఆలస్యంగా చేస్తూ నిర్లక్ష్యం వహించారని ఆవేదన వ్యక్తంచేశారు నిఖిత కుటుంబ సభ్యులు.మరో విషయం ఏమిటంటే జవహర్ నగర్ పోలీసులు 4 నెలలు గడుస్తున్నా బాధిత కుటుంబానికి శామలపల్లి బాలమణి కుటుంబ సభ్యులకు ఇంతవరకు ఎటువంటి సమాచారం ఇవ్వక పోవడం వల్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, అందుకే వారి చేస్తున్న అలసత్వాన్ని కి (హెచ్ ఆర్సీ) తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ను ఆశ్రయించి ఫిర్యాదు చేసినట్లు,బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని టిఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రింట్,ఎలక్ట్రానిక్ మీడియా కన్వీనర్ ఇటుక గోపి మాదిగ.అలాగే ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా నాయకులు రొట్టెల సునిల్ మాదిగ బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఉద్యమం కొనసాగిస్తామన్నారు.ఈవిషయాన్ని త్వరలో పద్మశ్రీ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు,అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ దృష్టికి తీసుకు వెళ్తామని




వారు ఈ సందర్భంగా తెలిపారు.టి ఎమ్మార్పీఎస్ నేత ఇటుక గోపి విజ్ఞప్తి:హైదరాబాద్ మహానగరంలో పెద నిరుపేద కుటుంబానికి చెందిన ఇంటి పెద్దలకు వారి పిల్లలు ఏం చేస్తున్నారు.వారి ప్రవర్తనను నిత్యం గమనించాల్సిన బాధ్యత కుటుంబ పెద్దల పైనే ఉంది.మన చూట్టూ కనిపియ్యాని మృగాలు సంచరిస్తూ ఉంటాయని వాటిని గమనించి పిల్లలను వారి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నా చిన్న విజ్ఞప్తి అంటూ నగరవాసులను కోరుతున్నారు

**టి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా కన్వీనర్ ఇటుక గోపి**

# ఏకంగా కిచ్చా సుదీప్‌తో రొమాన్స్




నటి దీప్‌శిఖ కన్నడ సినీ పరిశ్రమలోకి ఘనమైన అరంగేట్రం చేయబోతోంది. ఆమె సూపర్‌స్టార్ కిచ్చా సుదీప్‌తో కలిసి తెరను పంచుకోనుండటంతో ఈ ప్రకటన అభిమానులు, సినీ వర్గాల్లో విపరీతమైన ఉత్సాహాన్ని రేపింది. ఇది దీప్‌శిఖ సినీ ప్రయాణంలో ఒక కీలక మైలురాయిగా నిలవనుంది. అభిమానులు ఇప్పటికే ఆమెను "మార్క్ క్వీన్"గా పిలుచుకుంటూ సంబరాలు చేసుకుంటున్నారు. ఆఫిషియల్ డెబ్యూకి ముందే, దీప్‌శిఖ తన శక్తివంతమైన స్క్రీన్ ప్రెజెన్స్‌తో, కొత్తదనం నిండిన ఆత్మవిశ్వాసంతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. సినిమా నుంచి వచ్చిన ప్రారంభ అప్‌డేట్స్, లుక్స్‌తో సోషల్ మీడియా మొత్తం ఆమెపై ప్రశంసలతో మార్మోగుతోంది. ఆమె వేసిన ప్రభావానికి గుర్తింపుగా అభిమానులు ఆమెకు "మార్క్ క్వీన్" అనే బిరుదును ఇచ్చారు. ఈ అవకాశంపై కృతజ్ఞతను వ్యక్తం చేసిన దీప్‌శిఖ.. కిచ్చా సుదీప్‌తో కలిసి పనిచేయడం తనకు ఒక కల నెరవేరినట్టేనని చెప్పింది. ఆయనతో పని చేయడం ఎంతో వినయాన్ని, ప్రేరణను ఇచ్చిందని, ఆయన క్రమశిక్షణ, ప్రొఫెషనలిజం తన నటనను మరింత మెరుగుపరచేందుకు ప్రోత్సహించాయని తెలిపింది. అలాగే, ప్రతిష్ఠాత్మక నిర్మాణ సంస్థ సత్యజ్యోతి ఫిల్మ్స్‌తో అనుబంధం కలగడం పట్ల దీప్‌శిఖ చంద్రన్ ఎంతో ఆనందం వ్యక్తం చేసింది. ఇంతటి క్లాసిక్, గౌరవనీయమైన బ్యానర్‌తో పని చేయడం గర్వంగా ఉందని, వారి వారసత్వం, క్రమశిక్షణ, సృజనాత్మక నాణ్యత తనకు ఎంతో నేర్పిందని పేర్కొంది. ఇలాంటి గొప్ప నిర్మాణ సంస్థతోనే తన కన్నడ ప్రయాణం ప్రారంభం కావడం తన కెరీర్‌కు మరింత విలువ, ధైర్యం ఇచ్చిందని చెప్పింది.



# బ్యాడ్ గాళ్స్.. కానీ మంచోళ్లు..

ప్రశ్విత ఎంటర్‌టైన్‌మెంట్, నీలి నీలి ఆకాశం క్రియేషన్స్, ఎన్‌వీఎల్ క్రియేషన్స్ బ్యానర్స్‌పై ఫణి ప్రదీప్ ధూళిపూడి దర్శకత్వంలో వస్తున్న సినిమా 'బ్యాడ్ గాళ్స్'. 'కానీ చాలా మంచోళ్లు' అనేది ట్యాగ్ లైన్. రేణు దేశాయ్, అంచల్ గౌడ, పాయల్ చెంగప్ప, రోషిణి, యష్ణ, మొయిన్, రోహన్ సూర్య ప్రధానపాత్రల్లో కనిపించనున్న ఈ చిత్రం క్రిస్మస్ పండుగ కానుకగా డిసెంబర్ 25న విడుదల కానుంది. ఈ క్రమంలో డైరెక్టర్ మారుతి చేతుల మీదుగా ట్రైలర్ లాంచ్ చేశారు మేకర్స్. ఈ సందర్భంగా మాట్లాడిన మారుతి..'ట్రైలర్ చాలా బాగుంది. ప్రామిసింగ్‌గా అనిపించింది. దర్శకుడు ఫణి ప్రదీప్ ధూళిపూడి (మున్నా) నాకు చిరకాల మిత్రుడు. ఇండస్ట్రీలో సాధు జీవి.మంచి సంగీత జ్ఞానం ఉన్నవాడు.
తన మొదటి చిత్రం '30రోజుల్లో ప్రేమించడం ఎలా?'లో నీలి నీలి ఆకాశం పాట ఎంత పెద్ద హిట్ అయిందో అందరికీ తెలుసు. ఇప్పుడు 'బ్యాడ్ గాళ్స్' చిత్రంతో మన ముందుకు వస్తున్నాడు. ఒక మంచి విషయాన్ని కొత్తగా చెప్పడానికి ప్రయత్నం చేశాడు. ఒక ఐదుగురు కొత్త అమ్మాయిలతో సినిమా చేయడం.. ప్రొడక్షన్ విషయంలో కాంప్రమైజ్ కాకుండా పూర్తి చేయడం.. తన ప్యాషన్‌కి నిదర్శనం. సినిమా టైటిల్ మాత్రమే 'బ్యాడ్ గాళ్స్' కానీ సినిమా అంతా పాజిటివ్‌గా ఉంటుంది. ఇలాంటి కాన్సెప్ట్ సినిమాలు, ఆడవారికి ఇంపార్టెంట్ ఇచ్చే సినిమా తప్పక ఆడాలి. ఈనాటి ఆడపిల్లలు ఎలా ఉన్నారు? వాళ్ళ ఆలోచన విధానం? వాళ్ళు ఏమి కోరుకుంటున్నారు? అనే కాన్సెప్ట్‌తో తీసిన చిత్రం ఇది. తప్పక చూడండి. ఈ 'బ్యాడ్ గాళ్స్' చిత్రాన్ని ఆదరించండి' అని ప్రేక్షకులను కోరాడు.

# 'శంబాల'కు కిరణ్ అబ్బవరం బెస్ట్ విషెస్



ఆదిసాయికుమార్ హీరోగా నటించిన శంబాల సినిమా ఈ నెల 25న థియేటర్స్ లోకి వస్తోంది. నిన్న జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ గెస్ట్ గా పాల్గొన్నారు హీరో కిరణ్ అబ్బవరం.ఈ ఈవెంట్ లో కిరణ్ అబ్బవరం ఇచ్చిన స్పీచ్ శంబాల టీమ్ లో మరింత కాన్ఫిడెన్స్ పెంచింది. ఆది ఫాదర్ సాయికుమార్ తో తనకున్న అనుబంధాన్ని ఈ వేదిక మీద గుర్తుచేసుకున్నారు కిరణ్ అబ్బవరం. కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ.. శంబాల మూవీ గురించి ప్రతి ఒక్కరూ పాజిటివ్ గా చెబుతున్నారు. ఆది అన్నకు ఈ సినిమా పెద్ద హిట్ ఇవ్వాలి. నాకు ఇండస్ట్రీలో తెలిసిన పెద్ద హీరో సాయికుమార్ గారే. ఆయన నా ఎస్ ఆర్ కల్యాణమండపం సినిమాలో నటించి నా కెరీర్ గ్రోత్ కు కారణమయ్యారు. ఆయన నటించకుండా ఆ సినిమా ఫలితం ఎలా ఉండేదో తెలియదు. అప్పటి నుంచి నా ప్రతి సినిమాకు ఎంకరేజ్ చేస్తున్నారు సాయికుమార్ గారు. సక్సెస్ ఫెయిల్యూర్ కాదు క్రమశిక్షణ ముఖ్యమని ఆయన నాతో చెబుతుండేవారు. ఆ సూచనలే నా కెరీర్ లో ఉపయోగపడ్డాయి. సాయి గారు ఇండస్ట్రీలో అందరూ బాగుండాలని కోరుకుంటారు. అందుకే ఆయన పిలిస్తే తప్పకుండా ప్రతి ఒక్కరు ఈవెంట్ కు వస్తారు. ఆది అన్న ప్రేమకావాలి సినిమా టైమ్ లో నేను బీటెక్ చేస్తున్నా. ఆ సినిమా పాటలకు డ్యాన్స్ చేయని ప్రతి స్టూడెంట్ ఉండరు. దాదాపు 14 ఏళ్లుగా ఆది అన్న కంటిన్యూగా ఎఫర్ట్స్ పెడుతూ సినిమాలు చేయడం అనేది చాలా పెద్ద విషయం. హిట్లు కొట్టడం ఒకెత్తు అయితే.. ఇండస్ట్రీలో నిలదొక్కుకోవడం మరో ఎత్తు అని ఆది అన్నని చూస్తే అర్థమైంది. శంభాల మూవీ సక్సెస్ కావాలని కోరుకుంటున్నా. అన్నారు.

# వండర్ ఫుల్ విజువల్స్‌తో 'వృషభ'



మలయాళ స్టార్ హీరో మోహన్ లాల్ నటిస్తున్న ప్రెస్టీజియస్ మూవీ 'వృషభ'. ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని ఈ నెల 25న గీతా ఫిలిం డిస్ట్రిబ్యూషన్ గ్రాండ్ రిలీజ్ చేస్తుంది. కన్నెక్ట్ మీడియా, బాలాజీ టెలిఫిల్మ్స్, అభిషేక్ ఎస్ వ్యాస్ స్టూడియోస్ బ్యానర్లపై శోభా కపూర్, ఏక్తా ఆర్ కపూర్, సి.కె. పద్మ కుమార్, వరుణ్ మాథుర్, సౌరభ్ మిశ్రా, అభిషేక్ ఎస్ వ్యాస్, ప్రవీర్ సింగ్, విశాల్ గుర్నాని, జూహి పరేఖ్ మెహతా నిర్మించారు. విమల్ లహోటి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రాన్ని దర్శకుడు నంద కిషోర్ మలయాళం, తెలుగులో రూపొందించారు. విడుదల దగ్గర పడుతుండటంతో ప్రీరిలీజ్ ఈవెంట్ ఘనంగా నిర్వహించారు మేకర్స్. ఈ కార్యక్రమానికి హీరో సమర్జీత్ లంకేష్, హీరోయిన్ నయన్ సారిక, నటులు ఆలీ, బలగం సంజయ్, ప్రొడ్యూసర్ అండ్ డిస్ట్రిబ్యూటర్ బన్నీ వాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన బన్నీ వాస్.. 'భారీ బడ్జెట్ ఖర్చు పెట్టి 'వృషభ'ను నిర్మించారు. ఈ సినిమా విజువల్స్ గ్రాండ్‌గా ఉంటాయి. కింగ్ ఎపిసోడ్ వచ్చినప్పటి నుంచి సినిమా మరో స్థాయికి వెళ్తుంది. ఫైట్స్, ఎమోషనల్ కంటెంట్ కూడా బాగుంటుంది. సామ్ సీఎస్ మంచి మ్యూజిక్ ఇచ్చారు. నేను దాదాపు 45 నిమిషాల ఫుటేజ్ చూశాను. సమర్జిత్‌లో ఈజ్ ఉంది. అతను కన్నడలో పెద్ద స్టార్ అవుతాడు. నయన్ 'ఆయ్', 'క' సినిమాల తర్వాత 'వృషభ'తో హ్యాట్రిక్ అందుకోవాలి. మోహన్ లాల్ గారు అంటే మనందరికీ గౌరవం. ఆయన ఈ సినిమాను రిలీజ్ చేసే అవకాశం మాకు ఇచ్చినందుకు అదృష్టంగా ఫీల్ అవుతున్నాం' అని తెలిపాడు.

# సంక్రాంతి బరిలో రవితేజ..

మాస్ మహరాజా రవితేజ సంక్రాంతి బరిలోకి దిగుతున్నాడు. 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యాడు. కిశోర్ తిరుమల దర్శకత్వంలో వస్తున్న మూవీలో డింపుల్ హయాతి, ఆషికా రంగనాథ్ హీరోయిన్లు కాగా ఈ రొమాంటిక్ కామెడీ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను జనవరి 13న రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు మేకర్స్. భార్యాభర్తల సంబంధాలు, భర్తల బాధలు, ఆధునిక జీవితంలో వచ్చే సమస్యలను హాస్యాత్మకంగా చూపించే ఈ కథను ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. రామ సత్యనారాయణ... తన జీవితంలోని అంచనాలు మరియు బాధ్యతలతో సతమతమవుతాడు. అతని వైన్ ప్రాజెక్ట్ రిజెక్ట్ అవ్వడంతో స్పెయిన్ వెళ్తాడు. అక్కడ మానసను కలుస్తాడు. గర్ల్ ఫ్రెండ్‌గా సెట్ చేసుకుంటాడు. కానీ అప్పటికే ఆయనకు పెళ్లి అయిపోతుంది. ఈ క్రమంలో ఇంట్లో భార్య, బయట గర్ల్‌ఫ్రెండ్ మధ్య సమస్యలు తలెత్తుతాయి. ఆధునిక సలహాలు, పాత జ్ఞానంతో ఈ సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నించే క్రమంలో ఎలాంటి సమస్యలు తలెత్తుతాయి? వాటిని ఎలా హ్యాండిల్ చేశాడు? అనేది హాస్యాస్మతంగా మలిచాడు డైరెక్టర్.




# సంక్రాంతి బరిలోకి మరో హీరో

2026లో వచ్చే సంక్రాంతి పండుగ కానుకగా చాలా సినిమాలు రిలీజ్ అవుతున్నాయి. తెలుగులోనే అరడజనుకు పైగా సినిమాలు వస్తున్నాయి. అటు తమిళ సినిమాలు కూడా తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ లిస్టులోకి మరో సినిమా వచ్చేసింది. శివ కార్తికేయన్, శ్రీ లీల హీరో హీరోయిన్లుగా వస్తున్న లేటెస్ట్ మూవీ పరాశక్తి. జయం రవి, అథర్వ, రాణా దగ్గుబాటి ఈ సినిమాలో ప్రత్యేక పాత్రలో కనిపిస్తారు. సుధా కొంగర దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా పొలిటికల్ పిరియాడిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కింది. అయితే ఈ సినిమా జనవరి 14వ తేదీన రిలీజ్ చేయాలని ముందుగా అనుకున్నారు. ఏమైందో తెలియదు కానీ ఇవాళ మరో రిలీజ్ డేట్ అనౌన్స్ చేసింది చిత్ర బృందం. సంక్రాంతి కానుకగా జనవరి 10వ తేదీన రిలీజ్ చేయాలని పోస్టర్ కూడా వదిలింది. దీంతో తెలుగుతో పాటు తమిళ బాక్సాఫీస్ ముందు ఆసక్తికర పోటీ నెలకొంది. జనవరి 9వ తేదీన విజయ నటించిన జన నాయగన్ రిలీజ్ కానుంది. ఇప్పటికే ప్రకటన కూడా వెలువడింది. అయితే ఈ సినిమా రిలీజ్ అయిన ఒక్క రోజు తర్వాత పరాశక్తి రానుంది. దీంతో ఏ సినిమా హిట్ అవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అటు తెలుగులో ఇదే సంక్రాంతికి ది రాజా సాబ్, మన శంకర వరప్రసాద్, భర్త మహాశయులకు విజ్ఞప్తి, నారీ నారీ నడుమ మురారి, అనగనగా ఒక రాజు లాంటి సినిమాలు వరుసగా వస్తున్నాయి. మరి సంక్రాంతి బరిలో వస్తున్న ఈ సినిమాలలో దేనిని, ప్రేక్షకులు ఆదరిస్తారో చూడాలి.



# పొట్టపగిలి నవ్వేలా.. నారీ నారీ నడుమ మురారి



చార్మింగ్ స్టార్ శర్వా హెూల్సమ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'నారి నారి నడుమ మురారి'. రామ్ అబ్బరాజు దర్శకత్వం వహించిన ఈ చిత్రం నవ్వులు, భావోద్వేగాలు, ఆకట్టుకునే ఫ్యామిలీ డ్రామా కలయికలో పర్ఫెక్ట్ ఫెస్టివల్ మూవీగా ఉండబోతుంది. అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి ఎకె ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రంలో సంయుక్త, సాక్షి వైద్య కథానాయికలుగా నటించారు. జనవరి 14నసాయంత్రి 5:49 గంటలకు ఫస్ట్ షోతో మూవీ రిలీజ్ కాబోతుండగా.. మేకర్స్ తాజాగా సినిమా టీజర్ లాంచ్ చేశారు. ఇందులో కథ శర్వా పాత్ర చుట్టూ తిరుగుతుంది.అతను ప్రేమలో పడతాడు.. తన గర్ల్ ఫ్రెండ్ తండ్రిని వారి వివాహానికి ఆమోదించమని ఒప్పిస్తాడు. అంతా సజావుగా జరుగతున్న సమయంలో అతని మాజీ ప్రియురాలు అకస్మాత్తుగా ఆఫీస్‌లోకి రావడంతో ఊహించని మలుపు తిరుగుతుంది. తరువాత జరిగే హ్యూమరస్ సంఘటనలు.. ఇద్దరు అమ్మాయిల మధ్య చిక్కుకున్న శర్వా పాత్ర.. వినోదాత్మక కథనం ఆకట్టుకున్నాయి. ఇక టీజర్ లాంచ్ ఈవెంట్‌లో మాట్లాడిన శర్వా.. 'మనం అనుకున్నది సాధించే శక్తి మన అందరిలో ఉంటుంది. ఎవరి ఒపీనియన్స్‌పై ఆధారపడకండి. ఎందుకంటే మన లైఫ్‌ను మనమే బ్రతకాలి. కష్టపడి చదవండి. భయపడకండి. అనుకున్నది సాధించండి. ఎంజాయ్ చేయండి. ఈ సినిమా గురించి ఒకటే విషయం చెప్తాను. సినిమా పొట్టపగిలి నవ్వేలా వుంటుంది.

## గ్రామాభివృద్ధే ధ్యేయంగా పాలకవర్గం పని చేయాలి

**- యువజన నేత : దయ్యాల రాజశేఖర్**

**- తడగొండ గ్రామ పంచాయతీ నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు - సన్మానం**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని తడగొండ గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన గ్రామ ప్రథమ పౌరుడు ఉయ్యాల శ్రీనివాస్ గౌడ్, తదితర వార్డు సభ్యులను యువజన నాయకుడు దయ్యాల రాజశేఖర్ ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ రానున్న ఐదేళ్ల కాలంలో తడగొండ గ్రామాన్ని జిల్లా స్థాయిలోనే ఆదర్శ గ్రామంగా నిలబెట్టాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రథమ పౌరులుగా ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించాలని సూచించారు. గ్రామాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తూ, మౌళిక సదుపాయాలు, సంక్షేమ పథకాలు సమర్థంగా అమలు చేయాలని కోరారు. గ్రామంలో తలెత్తే సమస్యలను ఆలస్యం లేకుండా పరిష్కరిస్తూ అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని నూతన పాలకవర్గానికి దిశానిర్దేశం చేశారు.ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తారని రాజశేఖర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## పాఠశాల పరిశీలన నుండే పాలనకు శ్రీకారం చుట్టిన సర్పంచ్ డాక్టర్ మంజుల

**- గ్రామాభివృద్ధి దిశగా తొలి అడుగు**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, కొదురుపాక గ్రామ సర్పంచిగా ప్రమాణ స్వీకారం చేసిన డాక్టర్ కత్తెరపాక మంజుల – సుధాకర్ బాధ్యతల స్వీకరణ అనంతరంస్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండే తన పాలనకు శ్రీకారం చుట్టారు.గ్రామాభివృద్ధి దిశగా తొలి అడుగు వేసిన కొదురుపాక సర్పంచ్ డా. కత్తెరపాక మంజుల సుధాకర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల భవిష్యత్తే గ్రామ ప్రగతికి పునాది అన్న భావనతో పాఠశాల పరిస్థితులను క్షేత్రస్థాయిలో సమీక్షించారు.ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, విద్యార్థులతో నేరుగా మాట్లాడి భోజన నాణ్యత, సౌకర్యాలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై బోధన ప్రమాణాలు, విద్యార్థుల హాజరు, పదవ తరగతి ఫలితాల మెరుగుదలపై చర్చించారు. పదవ తరగతి విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించిన సర్పంచ్, చదువుపై పూర్తి దృష్టి పెట్టాలని, లక్ష్యంతో ముందుకు సాగితే మంచి భవిష్యత్తు సాధ్యమవుతుందని హితవు పలికారు. గ్రామ స్థాయిలో విద్యాభివృద్ధికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కత్తెరపాక సుధాకర్, వార్డు సభ్యులు అన్నళదాసు భాస్కర్, బలాగోని శ్రీనివాస్, సమత, నాగుల రవి వర్మలతో పాటు యూత్ సభ్యులు కత్తెరపాక పర్శరాములు, విక్కీ, కొండల్ రావు, బి.అనిల్,పి. రాజు,అభిలాష్ పాల్గొన్నారు.

## మేడిపల్లి లో సత్య సాయి బాబా జయంతి ఉత్సవాలు



మేడిపల్లి (ప్రశ్న న్యూస్) భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి అనుగ్రహ కరుణాకటాక్షాలతో స్వామివారి జయంతి ఉత్సవాలు దేశవ్యాప్తంగా జరుగుతున్న సత్యసాయి రథయాత్రలో భాగంగా మన తెలంగాణ రాష్ట్రానికి విచ్చేసినటువంటి స్వామివారి రథము మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని మేడిపల్లి సమితికి సోమవారం శ్రీ సత్య సాయి ప్రేమ ప్రవాహిని రథాన్ని శివం నుంచి మేడిపల్లికి తీసుకురావడం జరిగింది.మేడిపల్లి ధర్మరాజు ఇంటిదగ్గర రాత్రి స్వామివారి రథం బసచేయడం జరిగింది.మంగళవారం 5 గంటల 20 నిమిషాలకు ఓంకార సుప్రభాతం, నగర సంకీర్తన తర్వాత పూజా కార్యక్రమాలు ముగించుకొని స్వామివారి రథం శంకర్ నగర్ విహారిక ఎంక్లేవ్, మేడిపల్లి, కమలానగర్ తదితర కాలనీలలో ఊరేగింపు చేయించుకొని కమలానగర్లోని గణేష్ మండపం వరకు వివిధ కార్యక్రమాలు చేసుకుంటూ చేరుకోవడం జరిగింది. స్వామివారికి నైవేద్యం హారతులు సమర్పించి నారాయణ సేవ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో భక్తులు కార్యకర్తలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఉత్సాహంతో పాల్గొనడం జరిగింది. బాలవికాస్ పిల్లలు కూడా వివిధ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.గంగిరెద్దులు, హారతులు తదితర సాంప్రదాయక కార్యక్రమాలు కూడా చక్కగా నిర్వహించుకోవడం జరిగింది.ఈ కార్యక్రమానికి శ్రీ సత్యసాయి సేవా ఆర్గనైజేషన్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు సోమ సుందరం, పుట్టపర్తి సేవా కార్యక్రమాల ఇంచార్జ్ యాదగిరి రావు, శ్రీ సత్య సాయి సేవ సమితి మేడిపల్లి కన్వీనర్ నరసింహారావు, మహిళా కోఆర్డినేటర్ లక్ష్మీ ,ఆధ్యాత్మిక సమన్వయకర్త పుర ప్రముఖులు మోహన్ రెడ్డి,సర్వీస్ కోఆర్డినేటర్ పవన్ కుమార్,యూత్ కోఆర్డినేటర్ సంతోష్ కుమార్ పట్నాయక్, తర్వాత ధర్మరాజు,అంజిరెడ్డి, బాలవికాస్ ఇన్చార్జీలు, బాలవికాస్ పిల్లలు తర్వాత మిగతా వాలంటీర్లు కార్యకర్తలు పాల్గొని దిగ్విజయం చేశారు.

## క్రైస్తవ సోదరులకు ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు

**మెదక్ జిల్లా కాంగ్రెస్ నాయకులు బుడ్డ భాగ్యరాజ్**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్) క్రైస్తవ సోదరులకు ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేస్తూ మెదక్ జిల్లా కాంగ్రెస్ నాయకులు బుడ్డ భాగ్యరాజ్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా బుడ్డ భాగ్యరాజు మాట్లాడుతూ లోక రక్షకుడైన యేసుక్రీస్తు మానవాళి పాపాలను తొలగించేందుకు కన్యక గర్భమున జన్మించాడని తెలిపారు. సమస్త ప్రాణులపై అపారమైన ప్రేమను చూపిన యేసు కరుణామయుడిగా నిలిచారని పేర్కొన్నారు. ఆయన చూపిన ప్రేమ, క్షమ, త్యాగ మార్గంలో క్రైస్తవులు నడవడంతో పాటు సమాజంలోని ప్రతి ఒక్కరికి కరుణ పంచాలని పిలుపునిచ్చారు. క్రిస్మస్ సందర్భంగా కేక్ కటింగ్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ఆనందకరమని అన్నారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ప్రశంసించారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని మతాలకు సమాన గౌరవం ఇస్తూ, క్రిస్మస్ పండుగను అధికారికంగా ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

# మానవత్వం మంటగలిసే ప్రపంచం

**- మతోన్మాదం ఉగ్రవాదం మధ్య నలిగిపోతున్న భూమి**



ఈరోజు ప్రపంచం ఒక భయానక మలుపు వద్ద నిలబడి ఉంది. మానవ ధర్మం మానవత్వం అనే పదాలు పుస్తకాలలో మిగిలిపోతున్నాయి. వాస్తవంలో మాత్రం రక్తం ద్వేషం ఉగ్రవాదం ఆక్రమణలు ఇవే శాసనాలుగా మారాయి. మానవ జీవితం విలువ కోల్పోయి సంఖ్యలుగా మారుతోంది. ఒక దేశంలో జరుగుతున్న హింస మరొక దేశానికి కేవలం వార్తగా మారిపోతోంది. ఇది మానవజాతి పతనానికి సంకేతం. ఇటీవలి కాలంలో బంగ్లాదేశ్ లో భారతీయులపై ముఖ్యంగా హిందువులపై జరుగుతున్న దాడులు అత్యంత అమానవీయం. మత ద్వేషం అనే విషవృక్షం అక్కడ మాత్రమే కాదు భారతదేశాన్ని చుట్టుముట్టిన అనేక దేశాల్లో వేగంగా పెరుగుతోంది. నేపాల్ మాల్దీవులు శ్రీలంక పాకిస్తాన్ వంటి ప్రాంతాలన్నింటిలోనూ భారతదేశానికి వ్యతిరేక భావజాలాన్ని ప్రోత్సహించే ప్రయత్నాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. భారతీయుల పట్ల ద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రచారాలు మతం పేరుతో కొనసాగుతున్నాయి. ఇది యాదృచ్ఛికం కాదు. దీని వెనుక ఒక పెద్ద అంతర్జాతీయ వ్యూహం ఉంది. చిన్న చిన్న దేశాల్లో అంతర్గత అస్థిరతను పెంచి వాటిని శక్తివంతమైన దేశాల ప్రయోజనాలకు ఉపయోగించుకునే విధానం ఇది. మతాన్ని ఆయుధంగా మార్చి ప్రజలను రెచ్చగొట్టడం ఈ వ్యూహంలో ప్రధాన భాగంగా మారింది.భారతదేశం చుట్టూ అగ్ని వలయంభారతదేశానికి తూర్పున ఉన్న బంగ్లాదేశ్ ఉత్తరాన నేపాల్ పడమట పాకిస్తాన్ దక్షిణాన సముద్ర మార్గాలు అన్నింటిలోనూ ఒకరకమైన అస్థిరత నెలకొంది. ఈ అస్థిరత యాదృచ్ఛికం కాదు ప్రణాళికాబద్ధమైన ఒత్తిడి. ముఖ్యంగా భారతదేశ ఈశాన్య ప్రాంతమైన సెవెన్ సిస్టర్స్ రాష్ట్రాలకు వెళ్లే సన్నని మార్గాన్ని కూడా ప్రమాదంలోకి నెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతాన్ని వ్యూహాత్మకంగా అస్థిరం చేయడం ద్వారా భారతదేశ భద్రతను బలహీనపరచాలనే ఆలోచన స్పష్టంగా కనిపిస్తోంది. ఈ అశాంతికి ప్రధాన ప్రేరణ ఎవరు అనే ప్రశ్నకు సమాధానం స్పష్టంగా కనిపిస్తోంది. చైనా లాంటి అగ్రదేశాలు తమ భౌగోళిక ఆర్థిక రాజకీయ ప్రయోజనాల కోసం చిన్న దేశాలను మతపరమైన ఉగ్రవాదం వైపు మళ్లిస్తున్నాయి. ఆయుధాలు సరఫరా చేస్తూ ద్వేషాన్ని ఎగదోస్తూ యువతను జిహాద్ విప్లవం వంటి నినాదాల వెనుక నెట్టేస్తున్నారు. యువతను భావోద్వేగాలకు బానిసలుగా మార్చి వారిని విధ్వంసానికి సాధనాలుగా ఉపయోగిస్తున్నారు.ఇంకోవైపు అమెరికా లాంటి దేశాలు మానవ హక్కుల పేరుతో యుద్ధాలను న్యాయపరుస్తూ ఆయుధ వ్యాపారంతో ప్రపంచాన్ని మరింత ప్రమాదంలోకి నెట్టుతున్నాయి. యుద్ధాలు ఆగితే ఆయుధ మార్కెట్లు నష్టపోతాయనే వాస్తవం ప్రపంచానికి తెలిసిందే. అందుకే శాంతి కంటే సంఘర్షణే లాభదాయకమని భావించే వ్యవస్థలు బలపడుతున్నాయి. మధ్య ఆసియా ఆసియా ఖండం యుద్ధ భయంకర నీడఈరోజు ప్రపంచం ఒకే ఒక ప్రాంతంలో కాదు అన్ని వైపులా మండిపోతోంది. ఇజ్రాయిల్ గాజా ఘర్షణలు ఇరాన్ ఈజిప్ట్ లాంటి దేశాల మధ్య ఉద్రిక్తతలు మధ్య ఆసియా నుంచి దక్షిణ ఆసియా వరకు మొత్తం ఖండం దేగ కన్నుల కింద విలవిల్లాడుతోంది. యుద్ధ భయంతో కోట్లాది మంది సాధారణ ప్రజలు జీవిస్తున్నారు. బలవంతుడు బలహీనుడిని దోచుకునే తత్వమే ఈరోజు అంతర్జాతీయ రాజకీయాల మూల సూత్రంగా మారింది. మానవహనం శరణార్థుల సమస్య పిల్లల ప్రాణనష్టం ఇవన్నీ పక్క ప్రభావాలుగా మాట్లాడుతున్నారు. ఇది ఎంత దారుణం ఎంత అమానవీయం. ఒక చిన్నారి కన్నీటి విలువ కూడా ఈ వ్యవస్థలో లెక్కలోకి రావడం లేదు.మూడో ప్రపంచ యుద్ధం మానవజాతి అంతానికి సంకేతమాఈ దిశగా ప్రపంచం ఇలానే సాగితే మూడో ప్రపంచ యుద్ధం అనేది ఊహ కాదు తప్పనిసరి ప్రమాదం. అది మొదలైతే ఏ దేశం గెలిచిందన్న ప్రశ్న ఉండదు ఏ మతం నిలిచిందన్న ప్రశ్న ఉండదు. భూమిపై మనిషి మాత్రమే కాదు జీవరాశే మిగలని పరిస్థితి వస్తుంది. యుద్ధానికి దారి తీస్తే భూమి మీద గడ్డి కూడా మిగలదు అన్నది కేవలం కవితా వాక్యం కాదు అది శాస్త్రీయ నిజం. పరిష్కారం ఏంటి సనాతన ధర్మంలోనే మానవత్వపు మూలం ఈ అంధకారానికి పరిష్కారం ఆయుధాల్లో లేదు. ద్వేషంలో లేదు. ఆక్రమణల్లో లేదు. పరిష్కారం మానవత్వంలో ఉంది. భారతదేశం ప్రపంచానికి ఇచ్చిన గొప్ప వరం సనాతన ధర్మం. ఇది మతం కాదు ఇది ఒక జీవన విధానం. వసుధైవ కుటుంబకం ప్రపంచం ఒక కుటుంబం. అహింస పరమో ధర్మః హింసకు ఎప్పటికీ ధర్మం లేదు. సర్వే జనాః సుఖినో భవంతు అందరూ సుఖంగా ఉండాలి. ఇవే సనాతన ధర్మపు మూల సూత్రాలు. కానీ ఈ సారాంశాన్ని మతోన్మాదులు వక్రీకరిస్తున్నారు. పవిత్ర గ్రంథాలను ఆయుధాలుగా మార్చి యువతను అంధకారంలోకి నెట్టేస్తున్నారు. ధర్మాన్ని రక్షించాల్సిన చోట ధర్మం పేరుతో విధ్వంసం సృష్టిస్తున్నారు. యువతకు పిలుపు మానవ ధర్మమే నిజమైన విప్లవం ఈరోజు యువతకు నిజంగా కావాల్సింది ద్వేషం కాదు దిశ. ఆ దిశను చూపించగలిగేది సనాతన మానవ విలువలే. మత గ్రంథాల్లోని మానవత్వపు సారాంశాన్ని ప్రపంచానికి చెప్పాల్సిన బాధ్యత మనదే. యుద్ధం కాదు సంభాషణ. ఉగ్రవాదం కాదు అవగాహన. ఆక్రమణ కాదు సహజీవనం. ఇదే నిజమైన ధర్మయుద్ధం. చివరి మాట ప్రపంచం ఈరోజు ఒక అగ్ని పరీక్షలో ఉంది. మానవత్వం గెలిస్తే భవిష్యత్తు ఉంటుంది. ద్వేషం గెలిస్తే శ్మశానమే మిగులుతుంది. సామాజిక బాధ్యతగల కవిగా ఒక భారతీయుడిగా ఒక మనిషిగా ఈ ప్రపంచం మళ్లీ మానవ ధర్మం వైపు మళ్లాలని నేను కోరుకుంటున్నాను. ఇది నా ఆవేదన. ఇది నా విజ్ఞప్తి. ఇది మానవజాతికి ఒక హెచ్చరిక.



**సింహాచలం లక్ష్మణ స్వామి**

**సామాజిక బాధ్యతగల కవి, రచయిత**

## శ్రీ చైతన్య పాఠశాలలో జాతీయ రైతు దినోత్సవ వేడుకలు





శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తిలో శ్రీరామ్ నగర్ కాలనీలోని శ్రీ చైతన్య పాఠశాలలో జాతీయ రైతు దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థులకు రైతుల జీవన విధానాన్ని తెలియజేశాలా నేరుగా రైతుల వద్దకు తీసుకుని వెళ్లి వారి అనుభవాలను, నారు నాటడం, పంటలు పండించడం వంటి విషయాలపైన వాస్తవ అనుభవాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాలకు ప్రజల ఆకలిని తీర్చేందుకు శ్రమిస్తున్న రైతులందరినీ ఆహ్వానించారు. పాఠశాల ఆవరణ అంతా పల్లెటూరి వాతావరణన్ని తలపించేలా,విద్యార్థులు రైతన్నల కష్టాన్ని, పల్లెటూరు మహిళల శ్రమను తమ వేషాల ద్వారా ప్రదర్శించి అందర్నీ ఆకట్టుకున్నారు. పాఠశాల ప్రిన్సిపల్ ఎ. రూపాదేవి మాట్లాడుతూ. సమాజానికి నిజమైన హీరోలు అయినటువంటి రైతులకు జై కిసాన్ నినాదంతో జాతీయ రైతు దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ, రైతన్న చెమటకు గౌరవం ఇస్తూ, వారి పిల్లల కలలకు పూలబాటను వేయడానికి విద్యా దీపం లాగా పాఠశాల యాజమాన్యం నిరంతరం శ్రమిస్తుందని తెలిపారు.ఎ.జి.ఎం సురేష్ మాట్లాడుతూ ఎండలో, వానలో అలుపెరగకుండా కృషి చేసే రైతులే దేశానికి నిజమైన అన్నదాతలు, ఎల్లప్పుడూ వారిపై కృతజ్ఞతలు కలిగి ఉండాలి అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎ. ఓ. సురేష్, డీన్ త్రివేణి, ఇన్చార్జులు కల్పన, వాసంతి మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పాన్ ఇండియా ఎగ్జిక్యూటివ్ మెంబెర్ గా సత్తు శ్రీను



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో కార్యకలాపాలు కొనసాగిస్తున్న. హెడ్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ కు తెలంగాణా రాష్ట్రం కి చెందిన సత్తు శ్రీను ని పాన్ ఇండియా ఎగ్జిక్యూటివ్ మెంబెర్ గా నియమించినట్టు హెడ్ సంస్థ చైర్మన్ మాధవ్ తెలిపారు. ఈ సందర్భంగా సత్తు శ్రీను పత్రిక ప్రతినిధులతో మాట్లాడుతూ నా మీద నమ్మకం ఉంచి నన్ను నియమించినందుకు చైర్మన్ మాధవ్ కు నా నియామకానికి కృషిచేసిన జాతీయ ప్రధాన కార్యదర్శి సతీష్ దేవరకొండ కు ధన్యవాదాలు తెలియజేసుకుంటునాను. శక్తి మేరకు సంస్థ ఎదుగుదలకు కృషి చేస్తానని బాధితులకు అండదండగా ఉంటానని బాధితులకు న్యాయం లభించే లాగా పోరాటం చేస్తానని మా హెడ్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ తరఫున మానవ హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉంటామని తెలిపారు. పదవి స్వీకరించినందుకుగాను సంస్థ సభ్యులు, పుర ప్రముఖులు శ్రీను కి శుభాకాంక్షలు తెలియజేశారు

## కిష్టాపూర్ గ్రామ సర్పంచ్ సాదుల స్వప్న ఉశయ్య ను సన్మానించిన

**మెదక్ ఎంపీ రఘు నందన్ రావు**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) కొల్చారం మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామ నూతన సర్పంచిగా ఎన్నికైన సందర్భంగా మంగళవారం నాడు మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావును మర్యాదపూర్వకంగా కలిసి వారి ఆశీస్సులు తీసుకోవడం జరిగింది ఈ సందర్భంగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ స్థానిక సంస్థ ఎన్నికలలో బిజెపి పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకున్నందుకు ప్రతి కార్యకర్తకు ధన్యవాదాలు తెలిపారు రాబోయే ఎన్నికల్లో కూడా కలిసికట్టుగా బిజెపి పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని బిజెపి నాయకులకు విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు వాల్దాస్ మల్లేశం గౌడ్, కొల్చారం మండలం బిజెపి పార్టీ మండల అధ్యక్షులు పంతులు హరీష్, బిజెపి పార్టీ జిల్లా కౌన్సిల్ మెంబర్ ఎంచర్ల శేఖర్ యాదవ్, కిష్టాపూర్ ఉపసర్పంచ్ చందపురం నిర్మల శేఖర్ యాదవ్, వార్డు మెంబర్స్ అక్కే ప్రవీణ్ యాదవ్, పసుల ప్రసాద్ యాదవ్, పసుల రేఖ యాదగిరి, చాకల యశోద, బిజెపి నాయకులు, కాశమ్మ సాయిరాజ్, నాగుల గారి దుర్గా గౌడ్, అక్కిం గోపాల్, వడ్ల చంద్రశేఖర్, ఎంబరి శీను, మల్కే రాములు, సాదుల శ్రీశైలం, బిజెపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అర్జీదారులతో ముఖాముఖి భేటీ

**భూభారతి పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి**



నిజామాబాద్(ప్రశ్న న్యూస్) భూభారతి పెండింగ్ దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన జక్రాన్పల్లి మండలం కేశ్ పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ గ్రామంలో పెండింగ్ లో ఉన్న భూభారతి, రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలపై తహసిల్దార్, ఆర్.ఐ, ఇతర అధికారులతో సమీక్షించారు. దరఖాస్తులను పరిష్కరించే విషయమై నెలకొన్న ఇబ్బందులు, సాంకేతిక కారణాల గురించి రెవెన్యూ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటిని నివృత్తి చేస్తూ దరఖాస్తులను ఎలా పరిష్కరించాలనే విషయాలపై కలెక్టర్ సూచనలు చేశారు. భూ సంబంధిత సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారికి భూ హక్కులు కల్పించి సాంత్వన చేకూర్చాలనే సదుద్దేశ్యంతో ప్రభుత్వం అమలులోకి తెచ్చిన భూభారతి చట్టం లక్ష్యం నెరవేరే విధంగా కృషి చేయాలని కలెక్టర్ హితవు పలికారు. అర్హులైన ప్రతి అర్జీదారుడి దరఖాస్తును పరిశీలిస్తూ,

పరిష్కరించేందుకు అవకాశం ఉన్న వాటిని వెంటనే పరిష్కరిస్తూ తగిన న్యాయం జరిగేలా మానవీయ కోణంలో పని చేయాలన్నారు. అర్హులైన వారిని పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా సకాలంలో వారికి భూములపై హక్కులు కల్పించాలన్నారు. అనంతరం దరఖాస్తుదారులైన రైతులతో కూడా కలెక్టర్ ముఖాముఖిగా భేటీ అయి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన వారందరికీ భూభారతి చట్టంలోని నిబంధనలను అనుసరిస్తూ తప్పనిసరిగా భూములపై హక్కులు కల్పిస్తామని భరోసా కల్పించారు. కలెక్టర్ వెంట గ్రామ సర్పంచ్ రవికుమార్, తహసిల్దార్ కిరణ్మయి, స్థానిక అధికారులు ఉన్నారు.

# ఇళ్ల మధ్య చేపల మార్కెట్

# ముషీరాబాద్ లో నిత్య నరకం

- ముషీరాబాద్‌లో పాలకుల నిర్లక్ష్యానికి బలవుతున్న కాలనీవాసులు
- చేపల మార్కెట్ తరలింపులో ఎమ్మెల్యే ముఠా గోపాల్ విఫలం
- మాజీ మంత్రి కేటీఆర్ ప్రయత్నాలకు ఫలితం శూన్యం - సమస్య యధాతథం
- ట్రాఫిక్ జామ్ తో అంబులెన్స్ కు దారిలేని దుస్థితి

**(ఆర్ కె- ప్రశ్న న్యూస్ బ్యూరో)**



గెలిచిన నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలో పూర్తిగా విఫలం

హైదరాబాద్ మహానగరంలో ప్రభుత్వ స్థలాల వినియోగం మరోసారి తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది.
ప్రభుత్వ భూములను అక్రమంగా కబ్జా చేసినవారిపై చర్యలు తీసుకోవడంలో చూపే సడలింపు,
అదే భూములను ప్రజల సౌకర్యార్థం వినియోగించడంలో ఎందుకు కనిపించడం లేదన్న ప్రశ్నలు ముషీరాబాద్ స్థానికుల నుండి ఉద్ధృతంగా వినిపిస్తున్నాయి.





### కాలనీల మధ్యే చేపల మార్కెట్..

ముషీరాబాద్ ప్రాంతంలో నివాస ఇళ్ల మధ్య కొనసాగుతున్న చేపల మార్కెట్ కారణంగా ప్రజలు రోజూ నరకయాతన అనుభవిస్తున్నారు. ఉదయం మొదలయ్యే మార్కెట్ కార్యకలాపాలు మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగడంతో కాలనీవాసులు బయటకు రావడానికే భయపడే పరిస్థితి నెలకొంది. చేపల విక్రయాల వల్ల వెలువడే దుర్వాసనతో ఇళ్లలో కూర్చున్నా 24 గంటలు చేపల వాసనతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నామని పలువురు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిశుభ్రత లేకపోవడం, చెత్త, మురుగు నీటితో ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసిన ఇటు అధికారులు అటు పాలకులు పట్టించుకోకపోవడంతో నిత్యం అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



### ట్రాఫిక్ జామ్‌తో అత్యవసర సేవలకు అడ్డంకి..

మార్కెట్‌కు వచ్చే లారీలు, ఆటోలు, ద్విచక్ర వాహనాల తో కాలనీ రోడ్లను పూర్తిగా ఆక్రమించడంతో నిత్యం ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. దీంతో స్కూల్ పిల్లలు, ఉద్యోగులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
అత్యవసర పరిస్థితుల్లోఅంబులెన్స్‌కు కూడా దారి దొరకని దుస్థితి ఏర్పడుతుండటం ఆందోళనకరం.
ఇది ప్రాణాలకే ముప్పుగా మారుతోందని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ప్రజాప్రతినిధులపై విమర్శలు..

ఈ సమస్యను పరిష్కరించడంలో స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్ పూర్తిగా విఫలమయ్యారని ఆరోపణలు తీవ్రంగా వెల్లువెత్తుతున్నాయి.
పలుమార్లు వినతులు ఇచ్చినా సమస్య యథాతథంగానే ఉందని స్థానికులు వాపోతున్నారు. ఎమ్మెల్యేగా ముఠా గోపాల్ రెండుసార్లు చెందారని మరి ప్రజలు ఇలా రెండవసారి గెలిపించారు అర్థం కాని పరిస్థితి అని ప్రతిపక్ష నాయకుల విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో చేపల మార్కెట్ తరలింపుపై మాజీ మంత్రి కేటీఆర్ ప్రయత్నాలు చేసినప్పటికీ స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్ సహకరించలేదని దానితో ఫలితాలివ్వలేదని ప్రజలు గుర్తు చేస్తున్నారు.

### ప్రజల ప్రశ్న - ప్రభుత్వ భూములు ఎవరి కోసం.?

ప్రభుత్వ భూములు అక్రమ కబ్జాదారుల కోసమా.?
లేదా ప్రజల ఆరోగ్యం, భద్రత కోసం వినియోగించాల్సినవేనా.?
నివాస ప్రాంతాలకు దూరంగా, సరైన మౌళిక వసతులతో ప్రత్యేక చేపల మార్కెట్ ఏర్పాటు చేయడం ప్రభుత్వ బాధ్యత కాదా.? ఈ విషయంలో పాలకులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ముషీరాబాద్ ప్రజలు నిలదీస్తున్నారు.

### తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్..

చేపల మార్కెట్‌ను వెంటనే నివాస ప్రాంతం నుంచి తరలించి, ప్రజల ఆరోగ్యం, భద్రతను కాపాడేలా రేవంత్ రెడ్డి ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్ నిర్ణయాలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు. లేకపోతే ఈ సమస్యపై ఉద్యమం తప్పదని స్థానిక ప్రజలు హెచ్చరిస్తున్నారు.

# అంబర్ పేట నియోజకవర్గంలో

# అనుమతులకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు

- రాజకీయ నాయకుల కనుసైగల్లో టౌన్ ప్లానింగ్ అధికారులు
- ఫిర్యాదులు చేసిన అక్రమ నిర్మాణాలపై స్పందించని టౌన్ ప్లానింగ్ అధికారులు
- సీజింగ్ చేసి చేతులు దులుపుకుంటున్న టౌన్ ప్లానింగ్ అధికారులు
- టౌన్ ప్లానింగ్ ఏసిపి కి ఫోన్ చేసినా ఫోన్ లిఫ్ట్ చేయరు

అంబర్ పేట (ప్రశ్న న్యూస్) అంబర్ పేట నియోజకవర్గం లో ప్రభుత్వ అనుమతులు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని స్థానిక ప్రజలు టౌన్ ప్లానింగ్ అధికారులకు తెలిపిన వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని టౌన్ ప్లానింగ్ ఏసిపి కృష్ణకుమారికి ఫోన్ చేసిన ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ హర్షవర్ధన్ కు అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేసిన చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు అగ్రహారం వ్యక్తం చేస్తున్నారు. నోటీసులతో కాలం గడుపుతున్నారని సీజింగ్ ల పేరుతో నిర్మాణాల వద్ద సీజింగ్ బోర్డులను పెట్టి సీజ్ చేశామని ఫోటోలు దిగి పెడుతున్నారు తప్ప సీజింగ్ చేసిన తర్వాత సీజింగ్ బోర్డులో తొలగించి బిల్డింగ్ యజమానులు తమ నిర్మాణాలను పూర్తి చేసుకుంటున్నారని టౌన్ ప్లానింగ్ అధికారులు వాటిపై చర్యలు తీసుకోకుండా మౌనంగా ఉండడానికి గల కారణం ఏమిటని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### సీజింగ్ బోర్డు పెడతారు, అటువైపు కూడా చూడరు

అంబర్ పేట నియోజకవర్గం గోల్నాక డివిజన్లో ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం చేపడుతున్నారని జోనల్ కమిషనర్ కు ఫిర్యాదు చేసిన తూతూ మంత్రముగా కూల్చివేసి ఫోటోలను పెట్టి తమ పని అయిపోయినట్టుగా అధికారులు చేతులు దులుపుకున్నారని, తదనంతరం సీజింగ్ బోర్డు ఏర్పాటు చేసి అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం చేసిన బిల్డింగు సీజింగ్ చేసామని సీజింగ్ బోర్డును పెట్టి ఫోటోలు దిగి వచ్చేసారే తప్ప, అటువైపు కూడా టౌన్ ప్లానింగ్ అధికారులు చూడడం లేదని ఆ బిల్డింగ్ కు కలర్లు కూడా పడ్డాయని, గోల్నాక మజీద్ పక్కన అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం చేపడుతున్నారని స్థానికులు ఫిర్యాదు చేసిన టౌన్ ప్లానింగ్ అధికారులు ఆ బిల్డింగ్ వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని, టౌన్ ప్లానింగ్ అధికారులకు నిర్మాణదారులకు లోపాయికారి ఒప్పందం కుదిరిందా.? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అంబర్ పేట నియోజకవర్గం లో ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా భారీ నిర్మాణాలు జరుగుతున్నాయని ఆ నిర్మాణాలకు రాజకీయ నాయకులు వత్తాసు పలుకుతున్నారని రాజకీయ నాయకులకు అక్రమ నిర్మాణదారులకు వత్తాసు పలకడం వెనక మతలబు ఏమిటో.

### అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం చేపడితే చర్యలు ఏవి.?



గోల్నాక డివిజన్లో మసీద్ పక్కన అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం చేపడుతున్న బిల్డింగ్

ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్న బిల్డింగ్లపై అంబర్ పేట టౌన్ ప్లానింగ్ ఏసిపి కృష్ణకుమారి చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని క్షేత్రస్థాయిలో ఎక్కడా కూడా పర్యటించడం లేదని టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ హర్షవర్ధన్, చైన్ మాన్, న్యాక్ ఇంజనీర్ కనుసైగల్లో అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారని ప్రజలకు గుసగుసలు పెడుతున్నారు.
టౌన్ ప్లానింగ్ ఏసీపీకి పలుమార్లు ఫోన్ చేసిన ఫోను ఎత్తి మాట్లాడే తీరిక టౌన్ ప్లానింగ్ అధికారికి ఉండదా అని ప్రశ్నిస్తున్నారు. అంబర్ పేట నియోజకవర్గంలో సీజింగ్ చేసిన నిర్మాణం చేపడుతున్న బిల్డింగ్లపై టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోకపోవడం వెనక అంతర్యం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవి కిరణ్ టౌన్ ప్లానింగ్ అధికారుల పై విచారణ చేపట్టాలని ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం చేపడుతున్న భవనాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీజింగ్ చేసిన తర్వాత బోర్డులు తొలగించి నిర్మాణం చేపట్టిన నిర్మాణదారులపై



అంబర్ పేట డివిజన్ ప్రేమ్ నగర్ లో పాత భవనం పై నిర్మాణాలు

చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టిన బిల్డింగులకు జలమండలి అధికారులు, విద్యు శాఖ అధికారులు వీరికి కనెక్షన్లు ఇవ్వవద్దని ఓసి సర్టిఫికెట్ లేకుండా అధికారులు వీరికి కనెక్షన్లు ఎలా ఇస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గంలో అనుమతులకు విరుద్ధంగా



గోల్నాక డివిజన్లో సీజింగ్ చేసిన నిర్మాణం పూర్తి చేస్తున్న బిల్డింగ్

నిర్మాణం చేపడుతున్న బిల్డింగ్లపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు చేపడతారో వేచి చూడాలి.

# విద్యార్థుల కోసం ఏపీ సర్కార్ సౌత్ ఇండియా రాకెట్రీ ఛాలెంజ్

**- పోస్టర్ ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు**



అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలోని పాఠశాల, కళాశాల విద్యార్థుల్లో శాస్త్ర సాంకేతిక నైపుణ్యాలను, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందడుగు వేసింది. ఇందులో భాగంగా 'సౌత్ ఇండియా రాకెట్రీ ఛాలెంజ్ 2%ఖ%26' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ రాకెట్రీ ఛాలెంజ్ ఫైనల్స్ 2026 జనవరి 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకు మూడు రోజుల పాటు గుంటూరులోని విజ్ఞాన్ యూనివర్సిటీలో జరగనున్నాయి. ఈ పోటీలను రెండు విభాగాలుగా నిర్వహిస్తున్నారు. 16 ఏళ్లకు పైబడిన కళాశాల విద్యార్థుల కోసం 'కెమికల్ రాకెట్రీ', 6 నుంచి 12 ఏళ్ల మధ్య వయసున్న పాఠశాల విద్యార్థుల కోసం 'హైడ్రో రాకెట్రీ' విభాగాల్లో పోటీలు ఉంటాయి. సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో తొలిసారిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ముఖ్యమంత్రికి వివరించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను, ఆలోచనలను వెలికితీయడమే ఈ పోటీల ముఖ్య ఉద్దేశమని వారు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనాలని ఆసక్తి ఉన్న విద్యార్థులు, యువత ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని అధికారులు స్పష్టం చేశారు.

# ప్రత్యర్థులపై కేసులు వేసే పనిలో రేవంత్ బిజీగా ఉన్నారు

**- ప్రజలకు ఉపయోగపడే పనులు రేవంత్ చేయడం లేదన్న కేటీఆర్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి విమర్శలు గుప్పించారు. నల్గొండ జిల్లాలో కొత్తగా గెలిచిన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లను సన్మానించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి పాలనపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌రెడ్డి రెండేళ్లలో ప్రజలకు ఉపయోగపడే పనులు చేయకుండా, ప్రత్యర్థులపై కేసులు వేసే పనిలో మాత్రమే జోరుగా ఉన్నారని కేటీఆర్ మండిపడ్డారు. మీడియాకు లీకులు ఇవ్వడం, నోటీసుల డ్రామాతో ప్రజల దృష్టిని వేరే దిశగా మళ్లించడం చేస్తున్నారని విమర్శించారు. నదీ జలాలపై రేవంత్ కు ఏమాత్రం అవగాహన లేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. సాగునీటిపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని దుయ్యబట్టారు. సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటిందని... రేవంత్ కు దమ్ముంటే సహకారసంఘాల ఎన్నికలు నిర్వహించాలని సవాల్ విసిరారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను అమలు చేయకపోవడం వల్లే రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ కు పాల్పడుతున్నారని అన్నారు.

# వైకుంఠ ద్వార దర్శనాలపై వదంతులు నమ్మొద్దు

**- టీటీడీ చైర్మన్ స్పష్టత**



తిరుమల (ప్రశ్న న్యూస్) తిరుమల వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాలను భక్తులు నమ్మవద్దని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) చైర్మన్ బీఆర్ నాయుడు విజ్ఞప్తి చేశారు. దర్శనాల షెడ్యూల్‌పై ఆయన స్పష్టతనిస్తూ, భక్తులు ఎలాంటి అపోహలకు గురికావొద్దని కోరారు. డిసెంబర్ 30, 31, జనవరి 1 తేదీల్లో ఈ-డిప్ టోకెన్లు ఉన్న భక్తులకు మాత్రమే వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఆ మూడు రోజుల్లో టోకెన్లు లేని వారికి దర్శనం ఉండదని, అయితే జనవరి 2 నుంచి 8 వరకు సర్వదర్శనం క్యూలైన్ల ద్వారా దర్శించుకోవచ్చని తెలిపారు. టోకెన్లు లేని భక్తులు తిరుమలకు రావొద్దని చెప్పే అధికారం ఎవరికీ లేదని ఆయన తేల్చిచెప్పారు. దర్శనం లేనప్పటికీ, తిరుమల క్షేత్రానికి వచ్చే భక్తులను ఎవరూ అడ్డుకోరని భరోసా ఇచ్చారు. నకిలీ దర్శనం టికెట్ల అమ్మకాల వంటి ఘటనల నేపథ్యంలో భక్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని, భక్తుల రద్దీని నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు బీఆర్ నాయుడు వివరించారు. మంత్రుల సబ్ కమిటీ పర్యవేక్షణలో ఏర్పాట్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. భక్తులందరూ టీటీడీ సూచనలు పాటిస్తూ సంయమనంతో వ్యవహరించి, ప్రశాంతంగా స్వామివారి దర్శనం చేసుకోవాలని ఆయన కోరారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588